# యాజ్ఏమ్యాన్థింకెత్

## (మనిషి తన ఆలోచనల రూపం)

జేమ్స్ ఏలెన్

# యాజ్ఏమ్యాన్థింకెత్

## (మనిషి తన ఆలోచనల రూపం)

జేమ్స్ ఏలెన్

కాపీరైట్ © 2021, సహజమార్గ్ స్పిరిచ్యుయాలిటీ ఫౌండేషన్.

సర్వహక్కులు ప్రచురణకర్తవి. ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగిన వారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా వ్రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం. అనుమతి అభ్యర్థనల కోసం, దిగువ చిరునామా వద్ద ప్రచురణకర్తను సంప్రదించండి.

ISBN:

కవర్ ఆర్ట్ : G. ఉమామహేశ్వరి.

ప్రింటర్ :

ప్రచురణ :
హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్,
కన్హా శాంతి వనం, కన్హా విలేజ్,
రంగ రెడ్డి జిల్లా, తెలంగాణ 509325, ఇండియా

www.heartfulness.org

# విషయ సూచిక

ముందుమాట 06

ప్రస్తావన 10

ఆలోచన – శీలం 12

పరిస్థితులపై ఆలోచనల ప్రభావం 18

ఆరోగ్యం, శరీరం మీద ఆలోచనల ప్రభావం 36

ఆలోచన – ఉద్దేశం 42

లక్ష్యసాధనలో ఆలోచన పాత్ర 48

దర్శనం – ఆదర్శం 56

ప్రశాంతత 64

# ముందుమాట

ప్రచురించిన నూరు సంవత్సరాల తర్వాత కూడా కాలపరీక్షకు నిలబడి, వాటి విలువను నిలబెట్టుకున్న పుస్తకాలు బహు కొద్ది. అటువంటి విలువైన పుస్తకాలలో ఈ చిన్ని ప్రచురణ ఒకటి. మానవ ఆలోచన, చైతన్యాల స్వరూపం గురించి, తత్వవేత్త, ఆధ్యాత్మిక అన్వేషి అయిన జేమ్స్ ఏలెన్ పంచిన విజ్ఞానమే ఈ పుస్తకం. ఈ రచన 'ధ్యానానుభూతి ఫలితం' అని ప్రప్రథమంగానే ఆయన ఉద్ఘాటించారు. జేమ్స్ ఏలెన్ కనుగొన్న విషయాలు, షాజహాన్‌పూర్ వాస్తవ్యులు, నా ఆధ్యాత్మిక గురువు అయిన శ్రీ రామచంద్ర గారి ఆవిష్కరణలతో చక్కగా అనునదిస్తాయి. శ్రీ రామచంద్ర గారు కూడా, వారి రచనలను వారి స్వీయ ఆధ్యాత్మిక అనుభూతుల ఆధారంగానే రాశారు. మానవ మనస్సు గురించి సరళంగా వివరించే వారి రచనలలో, ఇద్దరూ కూడా మూల విషయానికే చేరుకున్నారు.

ఆలోచనకు, వ్యక్తిత్వం లేదా శీలానికి గల సంబంధాన్ని వివరిస్తూ, మన శీలానికి, పరిస్థితులకు, విధికి సంపూర్ణమైన బాధ్యత మనదే అంటారు ఏలెన్. 'ఆలోచన, వ్యక్తిత్వాలు రెండూ ఒకటే' అంటారు ఆయన. ఆత్మ సంయమనానికి, వ్యక్తిత్వంలోని లోపాలను సరిదిద్దుకోవడానికి సంసిద్ధతకు, మనస్సును పరిశుభ్రపరచుకోవడానికి, ఆయన మహత్తరమైన ప్రాముఖ్యత ఇస్తారు. ఏలెన్, బాధల ప్రకృతిని అర్థం చేసుకున్నారు. అందుకనే ఆయన, 'శుద్ధి చేయడమూ, మలినాలనూ ఇంకా అనవసరమైన వాటినీ వదిలించడమే బాధల యొక్క లక్ష్యం' అని మనకు గుర్తు చేస్తారు. విశ్వాన్ని నడిపించేది ఒక దివ్యన్యాయమని ఆయన అంగీకరిస్తారు.

‘శరీరం మనస్సుకు బానిస’ అంటారు ఏలెన్. అందువలన, ఆరోగ్య–అనారోగ్యాలు రెండూ, ఆలోచనలోనే వేరూని ఉన్నాయి. మన ఆలోచనలను, మన జీవిత లక్ష్యానికి జోడించాలనీ, లక్ష్యం కోసం సాధన, పరిశ్రమ అవసరమనీ ఆయన అంటారు. జీవితంలో జయాపజయాలు మన ఆలోచనల ఫలితమే అనే ఏలెన్, మన ఆధ్యాత్మిక సఫలత కూడా మన ఆకాంక్షలు, ఆలోచనల స్వచ్ఛత పైనే ఆధారపడి ఉంటుందని అంటారు. మన వికాసం పట్ల త్యాగబుద్ధితోనూ, జాగరూకతతోనూ వ్యవహరించాలనీ, ఏ పరిస్థితులలోనూ సాధించిన వాటికి పొంగిపోకూడదనీ ఆయన హితవు చెప్తారు.

ఏలెన్, మానవ మనస్సుకు ఉన్న సామర్థ్యాలలో, దర్శనా శక్తిని అత్యంత విలువైనదిగా పరిగణిస్తారు. ‘ఉన్నతమైన కలలను కనండి’, అంటూ, ‘వాస్తవికతకు కలలే బీజరూపాలు’, అంటారు ఆయన. మనస్సుకు, హృదయానికి ఉన్న ముఖ్యమైన సంబంధాన్ని ఆయన గుర్తించారు: “మీ మనసులో ఉన్నతంగా ఏర్పరచుకున్న దృశ్యం, మీ హృదయంలో అధిష్టించిన ఆదర్శం – అదే మీ జీవితాన్ని నిర్మించి, మీరుగా సాకారమౌతుంది.”

నిర్మలత, ప్రశాంతతలను పరిణామం చెందిన మనస్సు యొక్క చిహ్నాలుగా ఏలెన్ సూచిస్తారు. ఆ విధమైన మనస్సును, ‘వివేక చూడామణి’ గా ఆయన అభివర్ణిస్తారు. చివరగా, వీటన్నింటి వెనుక ఉన్న అసలైన సారథి, మన ఆత్మయే అని ఆయన తెలియజేస్తారు.

ఈ పుస్తకంలోని ప్రతి వాక్యమూ సంభావ్యతతో నిండి ఉంది. నిజానికి, మనల్ని అత్యున్నత స్థాయికి చేర్చడానికి ఉద్దేశింపబడ్డ మానవ ఆలోచనా వ్యవస్థ యొక్క సారమే ఈ పుస్తకం.

కమలేష్ పటేల్
కాన్హా శాంతి వనం
30 ఏప్రిల్ 2021

# ప్రస్తావన

‘ఆలోచనా శక్తి’ అనే అంశం గురించి విస్తారంగా చర్చించిన రచనలు ఎన్నో ఉన్నాయి. అయితే ఈ చిన్న పుస్తకం ఆ కోవకు చెందినది కాదు. ఇది ధ్యానానుభవాల ఫలితంగా వెలువడినది. వివరణాత్మకంగా కాక సూచనప్రాయంగా చెప్పే పుస్తకం ఇది.

తాను ఏరికోరి, ప్రోత్సహించిన ఆలోచనల కారణంగానే మనిషి తన జీవిత నిర్మాణానికి తానే కారకుడవుతాడు. అంతేకాదు, బాహ్యంగా కనపడే పరిస్థితులను, మనిషిలో అంతర్గతంగా ఉండి కనపడని శీలాన్నీ, ఈ రెండింటినీ నైపుణ్యంతో అల్లుతున్నది మన మనస్సే. ఇంతవరకూ అజ్ఞానం వలన ఇది తెలియక, బాధలతో నిండిన జీవితాన్ని మనస్సు అల్లుకుంటూ పోయింది. అదే మనస్సు ఇపుడు ఈ జ్ఞానంతో జీవితాన్ని ఆనందమయం చేసుకోగలదు. ఈ సత్యాన్ని గ్రహించి, దర్శించడానికి వీలుగా మనిషిని ప్రేరేపించడమే ఈ పుస్తక ఉద్దేశ్యం.

జేమ్స్ ఏలెన్

# ఆలోచన — శీలం

“తన హృదయంలో మనిషి ఎలా ఆలోచిస్తాడో, అదే అతనుగా అవుతాడు” అన్న సూక్తి మానవుని అస్తిత్వం అంతటికీ వర్తిస్తుంది. ‘యద్భావం తద్భవతి’ అన్నది మన పెద్దల సూక్తి. ఇది ఎంత సమగ్రమైనదంటే, మన జీవితంలోని ప్రతి స్థితిలోనూ, పరిస్థితిలోనూ దీని ప్రభావం కనపడుతుంది. ఒక వ్యక్తి ఏమి ఆలోచిస్తాడో, ఎలా ఆలోచిస్తాడో, అక్షరాలా అదే అతడి స్వరూపం కూడా. అటువంటి మొత్తం ఆలోచనలన్నీ కలుపగా తయారైనదే అతడి శీలం, స్వభావం (క్యారక్టర్).

విత్తనం నుండే మొక్క బయటపడుతుంది. అంటే, మొక్క మొలవాలంటే విత్తనం ఉండి తీరాలి అనేది ఎంత నిజమో, అలాగే ప్రతి చర్యా మనస్సులోని ఆలోచన అనే విత్తనం నుండి పుడుతుంది అనేది కూడా అంతే నిజం. ఆలోచనల ప్రమేయం లేకుండా చేతలుండవు. ఈ మౌలిక సూత్రం ‘కావాలనుకుని’ చేసిన పనులకు ఎంతగా వర్తిస్తుందో, అప్రమేయంగా లేదా ‘అనాలోచితంగా’ జరిగాయనుకున్న పనులకు కూడా అంతగానే వర్తిస్తుంది.

అలా ఆలోచన నుండి మొగ్గతొడిగిన చర్య, సుఖ, దుఃఖాలనే ఫలాలను ఇస్తుంది. ఆవిధంగా మనిషి పోగుచేసుకునే తీపి, చేదు అనుభవాలు రెండూ అతడి స్వయంకృతాలే.

నీ మనస్సులోని నీ ఆలోచనలే
నిన్ను రూపుదిద్దాయి.
నీమనస్సులోఅవివేకపు,చెడుఆలోచనలనుపోషిస్తే,
బాధలు త్వరలోనే నీ చెంతకు చేరతాయి.
ఆరోగ్యకరమైన,ప్రయోజనకరమైనఆలోచనలతో
నీ మనస్సును నింపుకున్నట్లైతే,
ఆనందం నీడలా నీతోపాటే ఉండి తీరుతుంది.

మనిషి ఎదుగుదల ఒక నిర్దిష్టమైన న్యాయాన్ని అనుసరించే జరుగుతోంది. అంతేకానీ, అది ఏదో యుక్తి, ఉపాయం వలన జరిగినది కాదు. దృశ్యమానమైన ఈ భౌతిక ప్రపంచంలో కార్య-కారణ సంబంధాలు ఎంత స్పష్టంగా తిరుగులేని విధంగా ఉంటాయో, మనకు కనపడని ఆలోచనల ప్రపంచంలోనూ అంతే స్పష్టంగా, గురితప్పకుండా, దారితప్పని విధంగా ఉంటాయి. ఒక ఉదాత్తమైన, దివ్యమైన శీల నిర్మాణం ఎవరి వరప్రసాదం వలనగానీ, అదృష్టవశాత్తుగా కలిగినదిగానీ కాదు. సదాలోచనతో చేసిన నిరంతర పరిశ్రమ వల్ల కలిగిన సహజమైన ప్రతిఫలమే ఇది. దైవసదృశ్యమైన ఆలోచనలతో ఏరికోరి చేసిన సుదీర్ఘ సాంగత్యం వలన కలిగినది ఇది. అదే లెక్కన ఎడతెగని దుష్ట, దుర్మార్గపు ఆలోచనలకు మనస్సు స్థావరంగా ఉన్నప్పుడు, దీని ఫలితంగా హీనమైన, మృగప్రాయమైన శీలనిర్మాణం జరుగుతుంది.

తనను తయారుచేసుకునేదీ, నాశనం చేసుకునేదీ కూడా మానవుడే. తన ఆలోచనల ఆయుధాగారంలో తనను నాశనం చేయగల

ఆయుధాలను స్వయంగా మానవుడు తయారు చేసుకుంటాడు. శాంతి సౌఖ్యాలకు నిలయమైన స్వర్గలోకపు సౌధాల నిర్మాణానికి అవసరమైన పనిముట్లను కూడా అక్కడే తయారు చేసుకుంటాడు. సరైన ఆలోచనలను ఎంపిక చేసుకుని, వాటిని సక్రమంగా ఆచరణలో పెట్టడం ద్వారా దివ్యత్వపు శిఖరాలను అధిరోహించగలడు. ఆలోచన దుర్వినియోగం చేయడం వలన, లోపలి ఆలోచనతో పొంతనలేని చేతల వలన, పశుస్థాయికి దిగజారనూ గలడు. ఈ రెండింటికీ మధ్య ఉన్న అన్ని స్థాయిలకు చెందిన శీలం కలిగిన వ్యక్తులు తారసపడతారు. అంటే తన శీల నిర్మాణానికి నిర్మాత, యజమాని మానవుడే అని గ్రహించాలి.

ఆత్మను గురించిన ఎన్నో సుందరమైన సత్యాలు ఈ తరంలో తిరిగి వెలుగులోకి వచ్చాయి. వాటిలో అత్యంత ఆనందదాయకమైనది, దైవ సహాయాన్ని వాగ్దానం చేసే ఆశాజనకమైన సత్యం ఇలా చెపుతుంది: ఆలోచనలకు యజమాని మానవుడే, శీల నిర్మాత మానవుడే. స్థితిని, పరిసరాలను, విధిని మలచుకునే శిల్పి కూడా మానవుడే. ప్రేమ, తెలివి, శక్తియుక్తుల స్వరూపమూ, తన ఆలోచనలకు సంపూర్ణమైన యజమానీ, మానవుడే. అందుచేత, మానవుని చేతిలోనే అన్ని పరిస్థితులను ఎదుర్కొనడానికి అవసరమైన సమాధానాలు, తాను సంకల్పించిన విధంగా తయారవడానికి కావాల్సిన పరిణామశక్తీ, పునర్నిర్మాణశక్తీ ఉన్నాయి.

ఎప్పటికీ – ఎంతటి దౌర్బల్యపు స్థితిలో ఉన్నా, అందరినీ దూరం చేసుకున్న దురదృష్ట పరిస్థితిలో చిక్కుకున్నప్పటికీ కూడా –

మానవుడే యజమాని. అయితే, దౌర్బల్యపు స్థితిలో, దిగజారిపోతున్న పరిస్థితులలో తన ఇంటిని సక్రమంగా సరిదిద్దుకోలేని మూర్ఖపు యజమానిగా వ్యవహరిస్తాడు. కానీ, దృష్టి మరల్చి తన స్థితిని విశ్లేషణ చేసుకోవడం ఏ క్షణం అయితే మొదలుపెడతాడో, తన అస్తిత్వానికి ఆధారమైన ఆ మౌలిక న్యాయ సూత్రాన్ని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడో, అప్పుడు ఒక తెలివైన యజమానిగా తయారై, తన ఆలోచనలను ఫలవంతమైన దిశలో పయనింపచేయడానికి తనకున్న శక్తియుక్తులను వినియోగించనారంభిస్తాడు. ఎరుక, చైతన్యం కలిగిన యజమాని అలా ఉంటాడు. ఆలోచనలను నియంత్రించే ఆ విశ్వజనీన సూత్రాన్ని తనలోనే కనుగొన్నప్పుడు, మానవునికి ఆవిధంగా వ్యవహరించడం సాధ్యపడుతుంది. నిత్యం ఆలోచనలను ఆత్మావలోకనం ద్వారా, విచారణ ద్వారా విశ్లేషించుకొని, తద్వారా గ్రహించిన దానిని ఆచరణలో పెట్టి, అనుభవం సంపాదించడం ద్వారా, ఆలోచనలను నియంత్రించే మూలసూత్ర రహస్యం అనుభవపూర్వకంగా అర్థం అవుతుంది.

ఎంతో శ్రమకోర్చి త్రవ్వి వెలికి తీయడం ద్వారా, బంగారం, రత్నాలు లభించిన విధంగానే, అస్తిత్వానికి సంబంధించిన అన్ని సత్యాలను, తనలోని ఆత్మ అనే గనిని అంతర్మధనం చేయడం ద్వారా మానవుడు పొందగలడు. అలా, తన శీల నిర్మాత తానే అనీ, తన జీవిత రూపకర్త తానే అనీ, తన భవితవ్యానికి శిల్పి కూడా తానే అనీ తెలుసుకుంటాడు. ఈ సత్యాలను నిర్ద్వందంగా నిరూపించుకోవాలంటే, మానవుడు తన ఆలోచనలను గమనించి, నియంత్రించి, వాటిని మార్చుకోవాలి. అంతేకాదు, తన మీద, ఇతరుల మీద, జీవితం మీద, పరిస్థితుల

మీద వాటి ప్రభావాన్ని గుర్తించాలి. ఇంకా, కార్య–కారణ సంబంధాలను ఓర్పుతో గుర్తించి, పరిశీలించి, వెదికిపట్టుకొని, నిత్య జీవితంలోని ఏ చిన్న సంఘటనైనా సరే, అది ఒక జ్ఞానప్రదాతగా భావించి దాని నుండి తగిన జ్ఞానాన్ని పొందడానికి నిరంతరం శ్రమించాలి. అప్పుడు మనిషికి కావలసిన అవగాహన, జ్ఞానం, శక్తీ లభిస్తాయి.

"అన్వేషించిన వారికే లభిస్తుంది; తలుపు తట్టినవారికే, అది తెరువబడుతుంది," అన్న సూత్రం మరెక్కడా లేనంత స్పష్టంగా, మనకు ఇక్కడ కనపడుతుంది. శ్రమకు తగ్గ ఫలితం తప్పక ఉంటుంది. జ్ఞాన భాండాగారపు తలుపులు తెరచుకోడానికి సహనం, సాధన, పట్టుదల ఎంతో అవసరం.

# పరిస్థితులపై ఆలోచనల ప్రభావం

మనస్సును ఒక తోటతో పోల్చుకుంటే, అది తెలివిగా సంరక్షించబడినదైనా, అసలు పట్టించుకోకుండా విడిచిపెట్టబడినదైనా, అందులో మొక్కలు తప్పక పెరుగుతాయని గమనిస్తాం. అలాగే మనస్సులోకూడా తప్పక ఆలోచనలు వస్తాయి. ఉపయోగకరమైన విత్తనాలు నాటకపోతే, పనికిరాని కలుపు మొక్కల విత్తనాలుపడి, కోకొల్లలుగా పనికి మాలిన మొక్కలు పెరుగుతాయి.

ఎలాగైతే తోటమాలి తన భూమిలో పనికిరాని కలుపు మొక్కలను ఏరిపారేసి, కావాల్సిన పూలు, పళ్ళ మొక్కలను జాగ్రత్తగా పెంచి పోషిస్తాడో, ఆలాగే మానవుడు కూడా మనస్సు అనే తోటలోకి వచ్చిన తప్పుడు, పనికిరాని, దుర్మార్గపు ఆలోచనలను ఏరివేసి, సరైన, ప్రయోజనకరమైన, సదాలోచనలను పెంచి పోషించడం ద్వారా వాటిని ఫలప్రదం గావించడానికి ప్రయత్నించాలి. ఈ ప్రణాళికను కొనసాగిస్తున్నప్పుడు, ఆత్మ అనే నందనవనానికి సమర్థుడైన తోటమాలీ, జీవిత నిర్దేశకుడూ తానే అని మనిషి త్వరలోనే గుర్తిస్తాడు. అంతేగాక, ఆలోచనలను నియంత్రించే విశ్వజనీనమైన మౌలిక నియమాలను తనలోనే కనుగొని, వాటి యొక్క శక్తి, మానసిక యంత్రాంగం కలసి వ్యక్తి యొక్క శీలాన్ని, పరిస్థితులను, గమ్యాన్నీ ఎలా రూపుదిద్దుతున్నాయన్న సున్నితమైన జ్ఞానాన్ని కూడా మరింత స్పష్టతతో అవగాహన చేసుకుంటాడు.

ఆలోచన, శీలం రెండూ ఒకటే. పరిసరాలు, పరిస్థితుల మాధ్యమం ద్వారానే శీలం బయటపడి గుర్తించబడుతుంది. కాబట్టి, జీవితంలో ఎదురయ్యే బాహ్య స్థితిగతులు ఏదోవిధంగా ఒక వ్యక్తి

యొక్క అంతర్గత స్థితితో పొంతన కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. అలాగని ఏదైనా సమయంలో ఉన్న బాహ్య పరిస్థితులు ఒక మనిషి యొక్క సంపూర్ణమైన శీలాన్ని ప్రతిబింబిస్తున్నట్లు కాదు. కానీ, ఆ పరిస్థితులు ఆ వ్యక్తి యొక్క ఆలోచనాధోరణిలో ఏదో ఒక కీలకమైన అంశంతో ముడిపడి ఉన్నాయనీ, ఆ పరిస్థితులు ఆ సమయంలో అతని వికాసానికి తప్పనిసరై, ఎదురయ్యాయనీ అర్థం చేసుకోవాలి.

ఏ మానవుడైనా తాను ప్రస్తుతం ఉన్న స్థితి తన జీవితాన్ని నియంత్రించే సూత్రానికి అనుగుణంగానే ఉన్నదని తెలుసుకోవాలి. తన ఆలోచనలతో ఏర్పడ్డ అతని శీలస్వభావాలు అతడిని అప్పటి ఆ స్థితికి చేర్చాయి. జీవితక్రమంలో అదృష్టానికీ, యాదృచ్ఛికానికీ చోటు లేదు. అది ఒక నిర్దిష్టమైన సూత్రాన్ని అనుసరించి జరిగి తీరుతుంది. ఇందులో తప్పు జరిగే అవకాశం లేదు. తమ పరిసరాలతో శ్రుతి తప్పామనుకున్నవారి విషయంలోనూ, పరిసరాలతో సంతృప్తి చెందిన వారి విషయంలోనూ కూడా ఈ సూత్రం సమానంగా వర్తిస్తుంది.

వికాస మార్గంలో ముందుకు సాగుతున్న మానవునికి, తన వర్తమానంలో ఎదురయ్యే పరిస్థితులన్నీ వాని నుండి పాఠాలు నేర్చుకొని, వాటిని అధిగమించడానికే కల్పించబడినవని తెలుసుకోవాలి. ప్రతి పరిస్థితీ నేర్పే ఆధ్యాత్మిక పాఠం నేర్చుకోగానే, ఆ పరిస్థితి మారిపోయి, మరో కొత్త స్థితి ఆ స్థానంలో ఎదురౌతుంది.

బాహ్యమైన స్థితి గతులు బాధిస్తున్నాయని మానవుడు నమ్ముతున్నంత కాలం పరిస్థితులు అతడిని చుట్టుముడుతూనే ఉంటాయి. కాని ఎప్పుడైతే తాను సృజనాత్మకమైన శక్తి కలిగినవాడిననీ, అంతరంగంలో దాగి ఉన్న వనరుల నుండి కావాల్సిన విధంగా పరిస్థితులను సృష్టించుకోగలననీ గ్రహించినప్పుడు, తనపై సాధికారతకు నిజమైన హక్కుదారుడు తానే అవుతాడు.

ఆత్మ నిగ్రహం, ఆత్మ శుద్ధి సాధన చేసిన ప్రతివారికి, ఆలోచన నుండే పరిస్థితులు ఉత్పన్నమౌతాయన్న మౌలిక రహస్యం తెలుసు. తమ మానసిక స్థితిని మార్చుకున్నంత మేరకు బాహ్యపరిస్థితులలో మార్పు రావడాన్ని గ్రహించిన వీరికి, ఇది సత్యం అని తెలుసు. శీలంలోని దోషాలను సవరించడానికి చిత్తశుద్ధితో నడుంబిగించినపుడు అనేకరకాలైన మార్పులు శీఘ్రంగా, స్పష్టంగా సంభవించి, ఆ వ్యక్తి వికసించడం కూడా అంతే నిజం అని అర్థం చేసుకోవచ్చు.

తనలో ఏ భావాలకు ఆత్మ రహస్యంగా ఆశ్రయాన్ని కల్పిస్తుందో, వాటిని ఆకర్షిస్తుంది. ఆ భావాలు అది ఇష్టపడేవి కావచ్చు, లేదా భయపడేవి కావచ్చు. ఆత్మ తను కోరుకున్న ఆకాంక్షలను సాకారం చేసుకుంటుంది. అలాగే తనలో ఉన్న ఆందోళనలను కూడా సాకారం చేసుకుంటుంది. ఆత్మ తను అనుకున్న ప్రతి దానిని, తగిన పరిస్థితులను కల్పించుకోవడం ద్వారా నిజం చేసుకుంటుంది.

కావాలని అనుకొని విత్తినదైనా, లేక లోనికి రానిచ్చినదైనా, మనస్సులోనికి వచ్చిన ప్రతి ఆలోచనా విత్తనం తప్పక తనలాంటి మొక్కను మొగ్గతొడిగి, త్వరలోనే ఆ వ్యక్తి యొక్క చేతలుగా, చర్యగా మారి, అవకాశంగా, పరిస్థితిగా ఫలించి తీరుతుంది. మంచి ఆలోచనలు మంచి ఫలితాలను, చెడు ఆలోచనలు చెడు ఫలితాలనూ ఇస్తాయి.

అంతర్గతమైన ఆలోచనా ప్రపంచానికి అనుగుణంగానే బాహ్య ప్రపంచపు పరిస్థితులు రూపుదిద్దుకొంటాయి. బాహ్య పరిస్థితులు అనువైనవి అయినా, కాకున్నా, వ్యక్తి మంచి కోసమే ఏర్పడ్డాయని గ్రహించాలి. తన పంటకు తానే యజమాని కాబట్టి, సుఖం, దుఃఖం అనే ఈ రెండు పంటల ద్వారా కూడా మానవుడు అవసరమైన జీవిత పాఠాలు నేర్చుకుంటాడు.

తన అంతరంగపు లోలోతుల్లోని కోరికలు, ఆకాంక్షలు, ఆలోచనలు తనపై అధికారాన్ని చెలాయించనిచ్చి, వాటిని అనుసరించడం ద్వారా, అవి చిట్టచివరకు బాహ్య పరిస్థితుల రూపంలో సాకారమై, తనకు ఎదురవడం మానవుడు చూస్తాడు. ఎదుగుదల, సవరణకు సంబంధించిన మౌలిక సూత్రాలు అంతటా వర్తిస్తాయి.
ఒక వ్యక్తి పతనానికి కారణం పరిస్థితులుగానీ, విధివ్రాతగానీ కాదు. అతని అంతరంగంలో ఉన్న హీనమైన కోరికలు, నీచమైన ఆలోచనలతో నిండిన మనస్సు మాత్రమే అతని పతనానికి దారితీస్తుంది. అలాగే సదాలోచనలు కల్గిన వ్యక్తి కేవలం బాహ్య పరిస్థితుల ఒత్తిడికి లొంగి నేరస్థుడౌతాడని అనలేము. ఒకానొక

నేరపూరితమైన ఆలోచన చాలాకాలంగా అతని హృదయంలో దాగి ఉండి, తగిన అవకాశం కలిగినపుడు శక్తి పుంజుకుని బయటపడడం వలన మాత్రమే అతడు నేరస్థుడౌతాడు. పరిస్థితులు మనిషిని తయారుచేయవు. అవి కేవలం మనిషి నిజస్వరూపాన్ని బయటపెడతాయి. లోలోపలి దుర్మార్గపు ఆలోచనల నైజమే మనిషిని పతనం కావిస్తుంది. అంతేకాని, ఎలాంటి పరిస్థితులు కూడా మనిషిని దుర్మార్గపు దిశలోకి దిగజార్చి, బాధలకు గురిచేయవు. అలాగే, పవిత్రమైన, ఆరోగ్యకరమైన, ఫలప్రదమైన ఆకాంక్షలను నిరంతరం హృదయంలో పోషిస్తేనే తప్ప, మనిషి కేవలం పరిస్థితుల ప్రభావంతో సన్మార్గంలో విజయం దిశగా ప్రయాణం కొనసాగించలేడు. అందుచేత, తనలోని ఆలోచనలకు ప్రభువు, అధిపతి అయినందువల్ల, మానవుడే తనని తాను తయారుచేసుకుంటున్నాడు, తన పరిస్థితులను తానే సృష్టించుకుంటున్నాడు. జన్మనెత్తి ఆత్మ ప్రత్యేకమైన ఉనికిలోనికి వచ్చినప్పటి నుండి, భూమ్మీద తను సాగించే యాత్ర ప్రతి అడుగులోనూ తన నిజస్థితిని వ్యక్తం చేసే స్థితి గతులను అది ఆకర్షిస్తుంది. ఆత్మ యొక్క బలాన్నీ, బలహీనతలను, పవిత్రత, అపవిత్రతలనూ ప్రతిబింబించేవిగా ఆ స్థితి గతులుంటాయి.

మనకు కావాల్సిన దానిని మనం ఆకర్షించం. కాని లోలోపల మనం ఏమిటో, దానినే ఆకర్షిస్తాం. మన కోరికలు, ఆకాంక్షలు, ఇష్టాయిష్టాలు అడుగడుగునా ఓటమిని చవిచూస్తాయి. అయినప్పటికీ మనలో అంతర్గతంగా దాగి ఉన్న ఆలోచనలు, కోరికలు మాత్రం తమకు కావాల్సిన ఆధారాన్ని, ఆహారాన్ని – మంచైనా, చెడైనా సరే – పొందుతూనే ఉంటాయి. మనల్ని

గమ్యానికి చేర్చే దివ్యవిధాత మనలోనే ఉన్నాడు. అది మనమే. మనమే మనలను బందీలుగా చేసుకున్నాం. మన ఆలోచనలు, చేతలే మనలను నిర్బంధించే అధికారులు. ఆలోచనలు, ఆచరణలు నీచమైనవైతే మనం బందీలుగా ఉంటాం. అవి ఉదాత్తమైనవిగా ఉంటే అవే మనకు ముక్తిని, స్వేచ్ఛను ప్రదానం చేసే దైవదూతలవుతాయి.

మనం దేనికోసమైతే ఆశించి ప్రార్థిస్తామో, అది మనకు లభించదు. మనం న్యాయంగా ఆర్జించినదే మనకు లభిస్తుంది. మన ఆశలు, ప్రార్థనలు – ఈ రెండూ మన ఆలోచనలు, చేతలతో ఏకీభవించినపుడు, సామరస్యాన్ని సాధించినపుడే, అవి ఫలప్రదమౌతాయి.

ఈ సత్యం దృష్టితో చూస్తే, మన జీవితాలలో, 'పరిస్థితులతో పోరాడటం' అనే దానికి అర్థం ఏమై ఉంటుందో పరిశీలిద్దాం. పరిస్థితులకు కారణమైన ఆలోచనలను మన హృదయంలో ఒకవైపు దాచి, పెంచి, పోషిస్తూ మరోవైపు అటువంటి ఆలోచనల ఫలితంగా బయట ఎదురైన పరిస్థితులతో పోరాడుతున్నామన్నమాట. ఇలా లోపల ఆలోచనల రూపంగా దాచుకున్న విషయం, తెలిసిన దుర్వ్యసనం రూపంలో అయినా లేదా గుర్తించలేని బలహీనత రూపంలో అయినా ఉండవచ్చు. ఏదైనప్పటికీ, అది ఆ వ్యక్తి ప్రయత్నాలకు మొండిగా అడ్డుపడుతూనే, సరైన పరిష్కారం కావాలని ఘోషిస్తూ ఉంటుంది.

మనలో చాలామంది పరిస్థితులను మెరుగుపరుచు కోవడానికి ఆత్రుత చూపిస్తాం. కాని మనల్ని మనం సరిదిద్దుకోవడానికి సంసిద్ధులుగా ఉండం. అందుచేత పరిస్థితి చేతుల్లో బందీగా మిగిలిపోతాం. నిజాయితీతో ఆత్మ పరిశీలన చేసుకోవడానికి నడుం బిగించినట్లయితే, మనం దేని మీద దృష్టి నిలిపామో దానిని సాధించి, దర్శించి తీరుతాం. ఈ సూత్రం ప్రాపంచిక విషయాల్లో ఎంత నిజమో, పారమార్థిక విషయాలలో కూడా అంతే నిజం. మన ఏకైక లక్ష్యం డబ్బు సంపాదించడమే అయినపుడు కూడా ఆ లక్ష్యం సాధించేలోపల ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయవలసి ఉంటుంది. అలాంటప్పుడు అన్ని రంగాలలో పరిణతి సాధించిన జీవితం ఒక లక్ష్యంగా పెట్టుకున్న వారికి మరెంత చేయాల్సి ఉంటుందో కదా!

కొంత మంది పుట్టు దరిద్రులున్నారనుకుందాం. వాళ్ళ పరిస్థితులు, ఇంట్లో సుఖసౌఖ్యాలు బాగా మెరుగుపడాలని ఎంతో ఆత్రుతగా ఉంటారు. కాని ఎప్పుడూ పని ఎగగొట్టడానికే ప్రయత్నిస్తుంటారు. యజమాని జీతం తక్కువ ఇస్తున్నాడనే నెపంతో ఎప్పుడూ పని ఎగగొట్టడాన్ని సమర్థించుకుంటూ ఉంటారు. నిజమైన సౌభాగ్యానికి ఆధారమైన మౌలిక సూత్రాలను వీళ్ళింకా అర్థం చేసుకోలేదు. పేదరికం నుండి బయటపడడానికి వారు పూర్తిగా అనర్హులవడమే కాకుండా, బలహీనపు, సోమరితనపు, మోసకారి ఆలోచనలతోనే ఉంటూ, అటువంటి ఆలోచనలనే చేతలలో, ఆచరణలో పెట్టడం ద్వారా మరింతగా పేదరికాన్ని తమవైపు ఆకర్షించుకుంటున్నారు.

మరో ఉదాహరణ తీసుకుంటే, కొంతమంది భాగ్యవంతులున్నారనుకుందాం. వారు తిండిపోతులవడం వలన రకరకాల ఇక్కట్లకు గురవుతుంటారు. ఎంత డబ్బైనా ఖర్చు పెట్టి తమ రోగాలను నయం చేసుకుందామనుకుంటారు. కాని అతిగా తినే తమ అలవాట్లను మాత్రం మార్చుకుందామని ప్రయత్నించరు. మితిమీరి మృష్టాన్న భోజనాలు తినాలి, ఆరోగ్యంగానూ ఉండాలన్న మనస్తత్వం వీరిది. అలాంటి మనుషులు ఆరోగ్యవంతమైన జీవితానికి అర్హులుకానే కారు. ఎందుకంటే ఆరోగ్యమైన జీవితాన్ని నిర్దేశిస్తున్న మొదటి మెట్టులోని మౌలిక సూత్రాలను వీరు ఇంకా నేర్చుకోలేదు కాబట్టి.

మరో దృష్టాంతం: కొంతమంది యజమానులు, న్యాయమైన వేతనాలు చెల్లించకుండా ఉండేందుకు అక్రమమైన మార్గాలను అన్వేషిస్తారు. అంతేకాదు, తాము ఎక్కువ లాభాలు ఆర్జించాలని పనివాళ్ళ జీతం తగ్గించేస్తారు. అటువంటివారు భాగ్యవంతులవడానికి అనర్హులు. తమ పేరుని, ఐశ్వర్యాన్ని పోగొట్టుకొన్నపుడు, పరిస్థితులను నిందిస్తారు. వారి స్థితిని వారే సృష్టించుకున్నారన్న విషయాన్ని వారు తెలుసుకోరు.

ఈ ఉదాహరణల వల్ల తెలిసేదేమిటంటే, చాలాసార్లు మనకు తెలియకుండా మన పరిస్థితులకు మనమే కారణం అవుతాం. ఒక వైపు మంచి లక్ష్యాలను ఎంపిక చేసుకున్నప్పటికీ, వాటితో ఏవిధమైన పొంతనా, సామరస్యం లేని ఆలోచనలు, చేతలను అనుసరించడం ద్వారా మనం అనుకున్న లక్ష్యాలను చేరలేకపోవడానికి మనమే అడ్డు అవుతామన్నమాట. ఇలాంటి

ఉదాహరణలు ఎన్నైనా చెప్పుకోవచ్చు కానీ దానివలన ప్రయోజనం లేదు. ఆలోచనా నియమాలు – అంటే, ఎటువంటి ఆలోచనలు ఎటువంటి ఫలితాలకు దారితీస్తాయో అనే విషయాన్ని – చదువరులు తమ హృదయంలో, తమ జీవితంలో పరిశీలించి తెలుసుకోనంత వరకూ, బయటి పరిస్థితుల గురించి ఎంత తెలుసుకున్నప్పటికీ ప్రయోజనం లేదు.

కేవలం ఓ వ్యక్తి జీవితంలోని బాహ్య పరిస్థితులను చూసి మనం ఎటువంటి నిర్ణయానికీ రాలేం. ఎందుకంటే, ప్రతి ఒక్కరి వ్యక్తిగత పరిస్థితులు ఎంతో సంక్లిష్టంగా ఉంటాయి. అలాగే లోతుగా పాతుకు పోయిన వారి ఆలోచనాధోరణి కూడా. 'హాయిగా ఉన్నా'ననడానికి కారణాలు ఒక్కొక్కరి విషయంలో ఒక్కో విధంగా ఉంటాయి. అందుచేత ఎవరి ఆత్మ–పరిస్థితిని సంపూర్ణంగా వారు మాత్రమే తెలుసుకోగలరు. ఇతరులు ఎటువంటి అంచనా వేయలేరు.

ఒకడు కొన్నింటిలో నిజాయితీగా ఉంటూ కూడా ఇక్కట్లకు గురవుతాడు. మరొకడు కొన్ని విషయాలలో అవినీతి పరుడుగా ఉంటాడు కానీ ధనం సంపాదిస్తాడు. బయటి పరిస్థితులను బట్టి అంచనా వేసి, నిజాయితీ వల్లనే ఒకడు జీవితంలో వైఫల్యం చెందాడనీ, మరొకడు తన అవినీతి చర్యల కారణంగా ఐశ్వర్యవంతుడయ్యాడనీ చెప్పడం పరిస్థితులను పైపైనే చూసి నిర్ణయించినట్లవుతుంది. ఎందుకంటే, అవినీతిపరుడు పూర్తిగా అవినీతిగా ఉన్నాడనీ, నిజాయితీపరుడు అన్ని విషయాలలో నిజయితీగా ఉన్నాడనీ, బాహ్యస్థితి గతులను బట్టి ఊహించుకోవడం వలన ఇలాంటి నిర్ణయానికి వస్తాం. కానీ,

లోతైన జ్ఞానం, విస్తృతమైన అనుభవం పరంగా చూస్తే, ఇటువంటి నిర్ణయానికి రావడం తప్పని తేలుతుంది. పైన చెప్పుకున్న అవినీతిపరునిలో రెండో వానిలో కనపడని కొన్ని సద్గుణాలుండవచ్చు. అలాగే ఆ నిజాయితీ పరునిలో మొదటివానిలో లేని కొన్ని దుర్గుణాలుండవచ్చు. తన మంచి ఆలోచనలు, చేతలకు నిజాయితీ పరుడు సత్ఫలితాలను ఎలాగైతే పొందుతాడో, అలాగే తనలోని దుర్గుణాలకు పర్యవసానంగా బాధలను కూడా అనుభవిస్తాడు. అలానే, అవినీతి పరుడు కూడా తన ఆలోచనలు, చేతల పర్యవసానంగా బాధలు, ఆనందం రెండూ అనుభవిస్తాడు.

మంచివాడికి కష్టాలు తప్పవనీ, మంచితనం వల్లే కష్టాలు వచ్చాయనీ నమ్మడం మనిషికి ఊరట కల్గిస్తుందేమో కానీ, అది సరైన అవగాహన మాత్రం కాదు. మనలో ఉండే దుర్బలమైన ఆలోచనలు, చేదు నిజాలు, మచ్చలు, కల్మషం తీసి పారేయనంత వరకూ, మనకు కల్గిన కష్టాలు మంచితనం వల్లే కలిగాయని, మనలోని దుర్గుణాల ఫలితం కాదని, ధృవపరచలేము. పరిపూర్ణతకు చేరుకునే ఈ మార్గంలో, మన ఆలోచనలలో మన జీవితాలలో ఒక విశ్వజనీనమైన మౌలిక న్యాయం పని చేస్తుందనీ, అది మంచికి చెడు ఫలితాలనూ, చెడుకు మంచి ఫలితాలనూ ఇవ్వదనీ కూడా గ్రహిస్తాము. ఎప్పుడైతే మనం ఇలాంటి జ్ఞానాన్ని పొందుతామో, అటువంటి జ్ఞానంతో మన గతంలోకి ఒకసారి తొంగిచూసినట్లయితే అప్పటి మన మూర్ఖత్వం, గుడ్డితనం కనపడడమేకాక, వికాసమార్గంలో ఇంకా ఎదగని మనం, ఎదుగుతున్నకొద్దీ మన గతించిన జీవితంలో ఎదురైన అనుభవాలన్నీ, మంచీ చెడు అంతా

తూకం వేసినంత ఖచ్చితంగా మంచికి మంచి, చెడుకు చెడు కలిగాయని అనుభవపూర్వకంగా గ్రహిస్తాం.

మంచి ఆలోచనలు, చేతలు చెడు ఫలితాలను ఇవ్వలేవు. అలాగే చెడు ఆలోచనలు, ఆచరణలు, చర్యలు సత్ఫలితాలను ఇవ్వలేవు. అంటే వరి విత్తితే వరే వస్తుంది గానీ, జొన్న రాదు. ముళ్ళ చెట్లు నాటితే ముళ్ళ కంపే వస్తుంది కాని మరొకటి రాదు. తెలిసికాని, తెలియక కాని ఏది విత్తామో అదే మొలకెత్తుతుంది. ప్రకృతిలోని ఈ న్యాయ సూత్రాన్ని మనం సులువుగా అర్థం చేసుకుని దానితో సహకరించి పనిచేస్తాము. కానీ, నైతిక, మానసిక ప్రపంచం విషయానికి వస్తే ఈ మౌలిక సూత్ర రహస్యాన్ని బహుకొద్ది మంది మాత్రమే గుర్తిస్తారు. భౌతిక ప్రపంచంలో ఈ సూత్రం ఎంత సూటిగా, సరళంగా ఉందో, మానసిక ప్రపంచంలో కూడా అంతే సూటిగా, సరళంగా ఉంది. కాని దానిని గ్రహించలేక పోవడం వలన దానితో సహకరించరు. బాధలు, కష్టాలు ఎల్లప్పుడూ ఏదో తప్పుడు ఆలోచనల ఫలితమే. మనతోనూ, మన ఉనికిని నిర్దేశించే మౌలిక నియమంతోనూ మనం సామరస్యాన్ని కోల్పోయాం అనడానికి కష్టాలు ఒక సంకేతం. మనలో వ్యర్థమైన, మాలిన్యమైన దాన్నంతటినీ కాల్చి, భస్మం చేసి మనల్ని శుద్ధి పరచటమే కష్టాల ఏకైక మహత్తరమైన ఉపయోగం. నిర్మల మనస్కులకు కష్టాలుండవు. శుద్ధి పరచిన బంగారాన్ని కాల్చడం వలన ప్రయోజనమేముంటుంది? నిర్మలమై, జ్ఞానోదయం చెందిన వ్యక్తి కష్టాల పాలు కాలేదు.

పరిస్థితులతో బాటు మనకు ఎదురైన కష్టాలు, సామరస్యం లోపించిన మన అంతరంగిక మానసిక స్థితి ఫలితమే. మనస్సులో సామరస్యపు స్థితి నెలకొని ఉన్నప్పుడు మనిషి పరిస్థితులను హుందాగా, ఆనందంగా ఎదుర్కొంటాడు. సదాలోచనలు ఉన్నాయనడానికి నిదర్శనం ఒకనిలో కనపడే హుందాతనం, ఆనందం, సౌఖ్యం. అంతేకాని సిరిసంపదలు కాదు. అలాగే దురాలోచనలకు కొలమానం కష్టాలు, బాధలే కాని సంపద లేకపోవటం ఎంతమాత్రం కాదు. కొందరికి భోగభాగ్యాలు మెండుగా ఉంటాయి కానీ జీవితం దుర్భరం. మరికొందరు పేదరికాన్ని అనుభవిస్తూనే సుఖంగా ఉంటారు. సంపదను సక్రమంగా, విజ్ఞతతో వినియోగించినపుడు మాత్రమే ఆనందం, ఐశ్వర్యం కలిసివస్తాయి. తన పేదరికానికి మరెవరినో బాధ్యునిగా భావిస్తూ, బాధపడేవారికి జీవితం మరింత దుర్భరం అవుతుంది.

పేదరికం, భోగలాలసత ఈ రెండూ దౌర్భాగ్యానికి రెండు అంచులు. ఈ రెండూ కూడా కృత్రిమమైనవే, అస్వభావికమైనవే. మనస్సు క్రమం తప్పడం వలన కలిగిన పరిస్థితులే ఇవి. ఆనందంగా, ఆరోగ్యంగా, సుఖంగా ఉన్నపుడే మనిషి సక్రమంగా ఉన్నట్లు. మన బయట, లోపల ఉన్న పరిస్థితులతో సామరస్యంగా ఉండడానికి అవసరమైన పొందిక మనలో కుదిరినపుడు, దాని పర్యవసానంగా ఆనందం, ఆరోగ్యం, సౌభాగ్యం కలుగుతాయి.

ఫిర్యాదులు చేయడం, దూషించడం మానివేసి, జీవితాలను నియంత్రించే ఆ కనపడని మౌలిక న్యాయ సూత్రాన్ని వెదకడం మొదలుపెట్టినప్పుడు మాత్రమే ఏ వ్యక్తి ఐనా ఒక నిజమైన మనిషిగా

పరివర్తన చెందడం ప్రారంభించినట్లు. ఆ నిర్దేశక సూత్రానికి అనుగుణంగా మన మనస్సును మలచుకోవడం నేర్చుకుని, మన పరిస్థితికి ఇంకొకరు బాధ్యులని నిందించడం మానివేస్తాం. అప్పుడు మనల్ని మనం బలమైన, ఆరోగ్యమైన ఆలోచనలతో నిర్మించుకుంటాం. పరిస్థితులను వ్యతిరేకించడం మానుకుని, తొందరగా అభివృద్ధి చెందడానికీ, మనలోనే దాగియున్న శక్తులను, సాధ్యాసాధ్యాలను కనుగొనడానికీ అవే పరిస్థితులను సహాయకారులుగా ఉపయోగించుకొంటాం.

విశ్వాన్ని నడిపించే బలవత్తరమైన సూత్రం ఒక న్యాయమే కానీ గందరగోళం కాదు. న్యాయం అనేదే జీవితాన్ని నడిపిస్తుంది, అన్యాయం కాదు. ఆత్మ ప్రపంచపు పరిపాలనలో ముందుకు నడిపించి, మలిచే శక్తి నైతికతే కాని అవినీతి కాదు. మౌలిక రహస్యం ఇదే అయినపుడు, మనల్ని మనం సరిదిద్దుకున్నపుడు ప్రపంచం అంతా సవ్యంగానే ఉన్నట్లు గ్రహిస్తాము. మనల్ని మనం సరిదిద్దుకునే ప్రక్రియలో, ఇతరులపట్ల, విషయాలపట్ల మన ఆలోచనలలో మార్పు తెచ్చుకుంటుంటే; ఇతరులు, పరిస్థితులు కూడా మన పట్ల మారుతున్నట్లుగా అనుభవపూర్వకంగా తెలుసుకుంటాం.

ఈ సత్యాన్ని ప్రతి మనిషీ తనలో దర్శించుకోవచ్చు. క్రమబద్ధంగా ఆత్మావలోకనం, అంతర్మథనం చేసుకోవడం ద్వారా ఈ సత్య దర్శనం సులువుగా అవుతుంది. మీ ఆలోచనలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చుకొని చూడండి. మీ జీవితంలోని భౌతిక పరిస్థితులలో వచ్చే శీఘ్రమైన పరిణామాలను చూసి మీరు ఆశ్చర్యపోకతప్పదు. మనిషి తన ఆలోచనను రహస్యంగా

దాచుదామనుకుంటాడు, కానీ అది కుదరదు. ఆలోచన త్వరలోనే అలవాటుగా, చర్యగా రూపుదిద్దుకుంటుంది. అలవాటు వెంటనే పరిస్థితిగా రూపాంతరం చెంది మన ముందు ప్రత్యక్షమౌతుంది. పాశవిక ఆలోచనలనే మనస్సులో పెంచి పోషిస్తే అవి మనిషిలో ఆ మత్తులోనే మునిగిపోవాలనుకునే అలవాటుగా మారి చివరకు దుఃఖాన్ని కలిగించే పరిస్థితులను కల్పిస్తాయి. అన్ని రకాల వినాశకరపు ఆలోచనలూ గందరగోళాన్ని సృష్టించి, శక్తిని హరించే అలవాట్లుగా మనిషిలో రూపుదిద్దుకొని, వాటి పర్యవసానంగా దారిమళ్ళించే, ప్రతికూల పరిస్థితులుగా ఎదురౌతాయి. భయం, అనుమానం, అపనమ్మకం, ఎటూ తేల్చుకోలేని ఆలోచనలతో మనస్సు నింపుకుంటే, మనిషి చేతలలో అనారోగ్యపు, నిలకడలేని అలవాట్లుగా తయారై, వైఫల్యం, పేదరికం, మానసిక బానిసత్వాన్ని ప్రోత్సహించే పరిస్థితులను అతని ముందు సృష్టిస్తాయి. సోమరితనపు ఆలోచనలు, ఆచరణలో నిజాయితీ లేని అపరిశుభ్రపు అలవాట్లుగా మారి వాటికి తగిన దౌర్భాగ్యపు, దుర్గంధపు పరిస్థితులను మనకెదురుగా నెలకొల్పుతాయి. అసహ్యించుకునే, ద్వేషపూరితమైన భావనలున్నవారికి, తిట్టడం, చేయిచేసుకోవడం లాంటి చర్యలు అలవాటుగా మారి, ఎప్పుడూ ఎవరో వెంట తరుముతున్నట్టి పరిస్థితులుగా వానికి ప్రత్యక్షమౌతాయి. హృదయంలోని అన్ని రకాల స్వార్థపు ఆలోచనలు, స్వలాభపు అలవాట్లుగా రూపుదిద్దుకొని, దయనీయమైన పరిస్థితులెదురౌతాయి.

మరోపక్క, మనస్సులో సుందరమైన ఆలోచనలు నింపబడితే, అవి అటువంటి వాని అలవాట్లలో హుందాతనంగా దయగా బయటపడి, ఉత్తేజకరం, సంతోషకరమైన పరిస్థితులుగా నెలకొని అభివృద్ధిని

ప్రోత్సహిస్తాయి. మనస్సులో మంచి నిర్మాణాత్మకమైన ఆలోచనలు గనక వర్ధిల్లుతుంటే, అవి మితత్వం, స్వయం నియంత్రణలాంటి అలవాట్లుగా మారి, నెమ్మది, శాంతకరమైన పరిస్థితులుగా ఎదురౌతాయి. ధైర్యం, స్వావలంబన, నిర్ణయం తీసుకునే ఆలోచనలు మనస్సులో నివసిస్తుంటే, అటువంటి వాని ఆచరణలో ఆరోగ్యవంతమైన, ప్రయోజనకరమైన అలవాట్లుగా తయారై, విజయం, సమృద్ధి, స్వేచ్ఛను కల్పించే పరిస్థితులుగా వాని ఎదుటకు వస్తాయి. మనస్సులోని ఆలోచనలు చురుకైనవైతే, అవి మనలో శుభ్రమైన, పరిశ్రమను ప్రోత్సహించే అలవాట్లుగా మారి, మన ముందు సంతోషకరమైన, ఆనందదాయకమైన పరిస్థితులుగా ఎదురౌతాయి. మృదువైన, క్షమించే గుణం గల ఆలోచనలు మనస్సులో పెరుగుతుంటే, అవి మన చర్యలలో మృదుస్వభావం కలిగించే అలవాట్లుగా మారి, ఆరోగ్యకరం, సురక్షితం అయిన పరిస్థితులను సృష్టిస్తాయి. ప్రేమ, నిస్వార్ధంతో కూడిన ఆలోచనలు మనస్సులో ఉంటే, మనల్ని మనం మరిచిపోయి ఇతరులకు సహాయం చేయగల అలవాటుగా మారుతుంది. ఖచ్చితమైన, నిలకడగల అభివృద్ధిని, నిజమైన సంపదలనూ కలిగించే పరిస్థితులు మన ముందుకు వస్తాయి.

ఒక నిర్దిష్టమైన, పట్టుదలతో కూడిన ఆలోచనా తరంగం, అది మంచిదైనా గానీ, చెడ్డదైనా గానీ, మన శీలం మీద, మన పరిస్థితుల మీద దాని ప్రభావం చూపక మానదు. మనం నేరుగా మనకు కావల్సిన పరిస్థితులను ఎంపిక చేసుకోలేం. కాని మన ఆలోచనలను మనం ఎంపిక చేసుకోవచ్చు. తద్వారా పరోక్షంగా మన పరిస్థితులనూ మనం ఖచ్చితంగా మలచుకోవచ్చు.

మనం ఎక్కువగా ప్రోత్సహిస్తూ, పోషిస్తున్న మన అంతరంగంలోని ఆలోచనలు, అవి మంచివైనా సరే, వినాశకరమైనవైనా సరే, అతి త్వరగా ఫలప్రదం కావడానికి ప్రకృతే దోహదపడుతుంది. మన ద్వారా మనతో సహకరిస్తూ, అలా బయటపడడానికి అనువైన అవకాశాలను, పరిస్థితులను ప్రకృతే కల్పిస్తుంది.

వినాశకరమైన, వ్యతిరేకమైన ఆలోచనా తరంగాలకు స్వస్తి పలికిన తక్షణమే, బయటి ప్రపంచం మనపట్ల మెత్తబడి, మనకు సహాయం చేయడానికి సంసిద్ధంగా ఉంటుంది. బలహీనపు, రోగగ్రస్తపు ఆలోచనాధోరణిని పక్కన పెట్టిన వెంటనే, మన ఈ దృఢ నిశ్చయాన్ని బలపరచడానికి అవసరమైన అవకాశాలెన్నో మన చేతికి అందుతాయి. మంచి తలంపులను ప్రోత్సహించడం మొదలు పెట్టగానే, సిగ్గుతో తలవంచుకునే పరిస్థితిని గానీ, కష్టాల పాలయ్యే పరిస్థితిని గానీ, ఏ శక్తీ మనకు కలిగించలేదు. మనముందున్నది రకరకాల రంగులతో కన్పించే విచిత్ర ప్రపంచం. మనలో నిరంతరం కదులుతూఉండే ఆలోచనా తరంగాలను ప్రతిబింబింప చేయడం కోసం కావాల్సిన సవరణలతో అది క్షణక్షణం మన ముందు రకరకాల రంగులను మారుస్తూ ఉంటుంది.

నీ సంకల్పం జరిగి తీరుతుంది.
'అనుకూలించనివాతావరణం'ఉందనినీవనుకుంటే
వైఫల్యాలతో సర్దుకుపోవాల్సిందే,
స్వతంత్రమైన నీ స్ఫూర్తి దీన్ని ధిక్కరిస్తుంది.

అది కాలాన్ని మించి, దేశాలను గెలిచి
'అదృష్ట'మనే మోసగాణ్ణి లొంగదీస్తుంది.
'పరిస్థితు'లనేనిరంకుశుడినిపదవినుంచితొలగించి
బుద్ధిగా, బంటులా మెలగమంటుంది.

చావులేని ఆత్మ సొంత బిడ్డ ఇది.
అగోచరమైన మానవ 'సంకల్పం' అదృశ్యశక్తి
అమృతత్వఆత్మకుబిడ్డ.అడ్డొచ్చినగోడలనుచీల్చి
అనుకున్న లక్ష్యానికి దారితీస్తుంది.

ఆలస్యమౌతోందని అసహనం చెందక
అర్థం చేసుకున్న నేర్పరివై వేచిఉండు.
స్ఫూర్తి ఎగసి శాసిస్తే
దేవతలైనా తల ఒగ్గాల్సిందే.

# ఆరోగ్యం, శరీరం మీద
# ఆలోచనల ప్రభావం

శరీరం మనస్సుకు సేవ చేసే బంటు. మనస్సు ఇచ్చే ఆజ్ఞలను దేహం శిరసావహిస్తుంది. అటువంటి ఆజ్ఞలు మనస్సు ఎంచుకున్నవైనా కావచ్చు, లేదా అసంకల్పితంగా జారీ చేసినవైనా కావచ్చు. దురాలోచనలు మోస్తున్న మనస్సు వలన దేహం త్వరగా రోగగ్రస్తమై, శుష్కించి నశించక తప్పదు. ఆనందకరమైన, సుందరమైన ఆలోచనా తరంగాలు జారీ చేసిన ఆజ్ఞలకు, శరీరం అందంతో, యవ్వనంతో తొణికిసలాడుతుంది.

పరిస్థితులలాగే, రోగం, ఆరోగ్యం కూడా ఆలోచనల నుండే పుడతాయి. అనారోగ్యపు ఆలోచనలు, అనారోగ్యం ద్వారా వ్యక్తమౌతాయి. భయం, తుపాకి గుండు లాగా మనిషి ప్రాణాన్ని తీయగలదని తెలిసిందే కదా. భయపు ఆలోచనలు ఖచ్చితంగా వేలాది మందిని కొద్దికొద్దిగా హతమారుస్తూనే ఉన్నాయి. రోగభయంతో జీవించే వారికే రోగాలు తప్పక వస్తాయి. ఆందోళన శరీరాన్నంతటినీ బలహీనపరచి, రోగానికి ద్వారం తెరుస్తుంది. దురాలోచనలు అమలు చేయకపోయినప్పటికీ కూడా, మనిషి నాడీవ్యవస్థను తప్పక త్వరలో దెబ్బతీస్తాయి.

దృఢమైన, నిర్మలమైన, సంతోషకరమైన ఆలోచనలు మన శరీరాన్ని శక్తితోనూ, హుందాతనంతోనూ నింపుతాయి. శరీరం చాలా సున్నితమైనది. ముడుచుకుపోగల, వికసించగల గుణాలు కలది. కాబట్టి, దేహం మీద ముద్రపడే ఆలోచనా తరంగాలకు శరీరం సులువుగా స్పందిస్తుంది. అలవాటుగా మారిన ఆలోచనాధోరణి తన ప్రభావాన్ని దేహం మీద చూపిస్తుంది. అవి మంచివైతే

మంచి ప్రభావం, చెడువైతే చెడు ప్రభావం శరీరం మీద పడుతుంది.

మలినమైన ఆలోచనలను ప్రసరింప చేస్తున్నంతకాలం, మనిషిలో రక్తం కలుషితమై, విషపూరితంగానే ఉంటుంది. నిర్మలమైన హృదయం నుండే నిర్మలమైన దేహం, నిర్మలమైన జీవితం పుట్టుకొస్తాయి. కలుషితమైన మనస్సు వలన శరీరమూ, జీవితమూ రెండూ కలుషితమైపోతాయి. చేతలకు, జీవితానికి దాని వ్యక్తీకరణకూ ఆలోచనలే మూలం. మూలాన్ని శుద్ధి పరిస్తే అన్నీ శుద్ధి అవుతాయి.

మనస్సులోని ఆలోచనలను మార్చకుండా, కేవలం ఆహారంలో మార్పు చేయడం వలన ఫలితమేమి ఉండదు. మన ఆలోచనలు నిర్మలమైనప్పుడు అనారోగ్యకరమైన ఆహారం తినడానికి ఇష్టపడము.

శుద్ధమైన ఆలోచనలు శుద్ధమైన అలవాట్లను కలగజేస్తాయి. మహానుభావులుగానూ, సన్యాసులుగానూ చెప్పుకునేవారు, శారీరిక పరిశుభ్రతను పాటించకపోతే, వారు నిజమైన సన్యాసులే కారు. తన ఆలోచనలను క్రమబద్ధం చేసుకుని, శుద్ధీకరించుకున్న వ్యక్తి హానికారకాలైన సూక్ష్మ క్రిములను పట్టించుకోనక్కర్లేదు.

దేహాన్ని బాగుపరచాలనుకుంటే, మనస్సును కూడా బాగుపరచాలని గ్రహించాలి. మనస్సును సుందరంగా తీర్చిదిద్దుకుంటే, తద్వారా శరీరం కూడా మెరుగవుతుంది. కపటం,

అసూయ, నిరాశ, నిస్పృహలు శరీర ఆరోగ్యాన్నీ, హుందాతనాన్నీ హరించివేస్తాయి. దిగాలుగా ఉన్న మొఖం దానంతటదే రాదు! దాని వెనుక దయనీయమైన ఆలోచనా తరంగాలున్నాయని తెలుసుకోండి. అలాగే, అందవిహీనమైన ముడుతలకు కారణం మూర్ఖత్వం, చింతలలో కూరుకుపోవడం, పొగరుబోతుతనం.

నాకు తెలిసిన ఒక 96 ఏళ్ళ స్త్రీమూర్తి ముఖం కాంతివంతంగా, అమాయకమైన అమ్మాయి ముఖంలాగా ఉండేది. నాకు తెలిసిన మరో మధ్య వయస్కుని ముఖంలో వయసుకు మించిన ముడుతలుండేవి. మంచి ఆలోచనలు కలిగిన మనస్సు ఒకరిదైతే, మరొకరిది కోరికలలో, అసంతృప్తిలో కూరుకుపోయినటువంటిది.

గాలి వెలుతురును అన్ని గదులలోకి రానిస్తేనే ఇల్లు సుందరంగా, శుభప్రదంగా నివాస యోగ్యమైనదిగా ఉంటుంది. అలాగే మనస్సులోకి ఆనందాన్ని, అందరి మేలుకోరే, ప్రశాంతమైన ఆలోచనలను రానిచ్చినపుడే ఆరోగ్యమైన శరీరం, కాంతివంతమైన ముఖ వర్చస్సూ కలుగుతాయి.

వృద్ధులైన వారి ముఖంలో సానుభూతి వలన ఏర్పడిన ముడుతలు కనిపిస్తాయి. ఇతరులలో అవి దృఢమైన, స్వచ్ఛమైన ఆలోచనలకారణంగా అనీ, మరికొందరిలో అవి ప్రతికూలమైన భావోద్వేగాల కారణంగా కలిగినవనీ తెలుసుకోవచ్చు. సన్మార్గంలో జీవించిన వారికి వయసు పెరుగుతున్న కొద్దీ నిర్మలంగా, ప్రశాంతంగా, మృదువుగా, అస్తమిస్తున్న సూర్యునిలా జీవితం సాగిపోతుంది. ఈ మధ్య చనిపోతున్న ఒక తత్వవేత్తను చూసాను.

వయసులో తప్ప ఆయనలో ముసలితనం కనపడలేదు. ఆయన మధురంగా, ప్రశాంతంగా ఎలా జీవించాడో, అలాగే చనిపోయాడు కూడా.

శరీర అనారోగ్యాన్ని దూరం చేయడానికి సంతోషకరమైన ఆలోచనను మించిన వైద్యుడు లేడు. బాధలు, కష్టాల నీలి నీడలను పారద్రోలడానికి, అందరి శ్రేయస్సు కోరే మనస్తత్వానికి మించిన ఉపశమనం, ఊరట మరొకటి లేదు. నిరంతరం ఇతరుల చెడుకోరడం, నిరాశావాదం, అనుమానం, ఈర్ష్య లాంటి ఆలోచనలతో జీవించడమంటే, స్వయంగా తయారుచేసుకున్న ఖైదులో బందీగా ఉన్నట్లే. కానీ, అందరి మంచిని కోరుకుంటూ, అందరితో ఆనందంగా ఉంటూ, అందరిలో ఉన్న మంచిని సహనంతో గుర్తించి తెలుసుకుంటూ, నిస్వార్థపు ఆలోచనలతో ఉండడమంటే స్వర్గధామంలో జీవిస్తున్నట్లే లెక్క. అన్ని జీవుల శాంతి కోసం ఎల్లప్పుడూ పరితపించే వానికి సుస్థిరమైన ప్రశాంతత సమృద్ధిగా లభిస్తుంది.

# ఆలోచన – ఉద్వేగం

ఆలోచన, ఉద్దేశ్యం – ఈ రెండూ జతకలవనిదే ప్రయోజనకరమైనదేదీ సాధించలేము. నీటి మీద తేలే చెక్కముక్కకి గమనం ఉంటుంది కానీ గమ్యం లేనట్లుగానే, చాలా మందిలోని ఆలోచనలు ఉద్దేశ్యరహితంగా, గాలి వాటంగా సాగుతుంటాయి. లక్ష్యం లేకపోవటమన్నది ఒక దురలవాటు. ప్రమాదాలు, వినాశనాల నుండి తప్పించుకోవాలనుకున్నవారు అలా ఉద్దేశ్యరహితంగా, గాలివాటంగా ఆలోచనలను పోనివ్వకూడదు.

తమ జీవితానికంటూ ఒక ముఖ్యమైన లక్ష్యం ఏర్పరచుకోనివారు, చీటికీ మాటికీ దుఃఖాలకు, భయాలకు, కష్టాలకు, తన మీద తాను జాలి పడడంలాంటి వాటికి సులువుగా గురవుతారు. ఇది బలహీనతకు చిహ్నం. వైఫల్యానికి, బాధలకు, నష్టాలకు ఇది ఖచ్చితంగా దారి తీస్తుంది. బలంతో పరిణతి చెందుతున్న ఈ విశ్వంలో, బలహీనత మనుగడ సాగించగలదా!

మన హృదయంలో ఓ న్యాయబద్ధమైన లక్ష్యాన్ని నింపుకొని దాన్ని సాధించడానికి ప్రయత్నించాలి. మన ఆలోచనలన్నీ ఈ లక్ష్యం మీద కేంద్రీకృతం కావాలి. అలా నిర్ణయించుకున్న లక్ష్యం అప్పటి మన స్వభావానికి అనుగుణంగా ఉన్న ఒక ఆధ్యాత్మిక ఆశయమన్నా కావచ్చు, లేదా భౌతిక పరమైన వస్తుసంపదైనా కావచ్చు. అది ఏదైనప్పటికీ, మన ఆలోచనాశక్తులను సమీకరణ చేసుకుని, మనమే ఎంపిక చేసుకున్న, మనముందున్న లక్ష్యంపై శ్రద్ధతో సమాయత్తం చేయాలి. మనం ఏర్పరచుకున్న ధ్యేయ సాధనే మన విద్యుక్తధర్మంగా ఎంచి, దానికోసమే నిరంతరం పాటుపడాలి.

అంతేకానీ ఊహలు, పగటి కలలు, క్షణభంగురపు ఆకర్షణలపైకి మన ఆలోచనలను పోనివ్వ కూడదు. ఆత్మ నియంత్రణకు, నిజమైన ఏకాగ్రతకు రాచబాట ఇదే. లక్ష్యాన్ని సాధించడంలో మనం మళ్ళీ, మళ్ళీ వైఫల్యం చెందినా ఫరవాలేదు. మనలో బలహీనతలను మనం వదిలించుకునేంతవరకూ వైఫల్యాలు ఎదురౌతాయి, అవ్వాలి కూడా. అయితే ఈ సాధనా ప్రయత్నాలు ఇలా సాగుతుండగా, మనలోన జరుగుతున్న శీల నిర్మాణం బలపడుతూ ఉంటుంది. అదే మన విజయానికి అసలైన కొలమానం. అలా ఇప్పటి వరకూ నిర్మితమైన వ్యక్తిత్వం ఆధారంగా ముందు రాబోయే శక్తి, విజయాలు ప్రారంభమౌతాయి.

అలాంటి ఒక గొప్ప మహత్తరమైన లక్ష్యాన్ని ఊహించుకోవడానికి సిద్ధంగా లేని వారు, తాము చేస్తున్న పనిని – అది ఎంత చిన్నదైనప్పటికీ – దానినే ఒక విధిగా భావించి, తమ ఆలోచనలనన్నింటినీ దాని మీదే కేంద్రీకరించి, తప్పులు లేకుండా చేయడానికి ఉపక్రమించాలి. ఇలా చేయడం వల్లనే ఆలోచనలను సమాయత్తపరచి, కేంద్రీకృతం చేయగలం. తద్వారా స్పష్టతను, శక్తినీ పెంపొందించుకోగలం. అలా చేయగలిగినపుడు, మనం సాధించలేనిదంటూ ఏమీ ఉండదు.

ఒక బలహీనమైన జీవి, తన బలహీనతను గుర్తించి, కృషి, సాధన ద్వారానే బలం చేకూరుతుందన్న సత్యాన్ని నమ్మినపుడు, వెంటనే తను ప్రయత్నం, అభ్యాసం మొదలు పెట్టి, శ్రమకు మరింత శ్రమను జోడిస్తూ, ఓర్పుకు మరింత సహనాన్ని జోడించి, బలాన్ని మరింతగా వృద్ధి పరచుకుంటూ, వికాసపథంలో ముందుకు

పోక మానదు. చిట్ట చివరకది దివ్యత్వపు శక్తితో సమానంగా ఎదుగుతుంది.

శారీరకంగా బలహీనమైన మనుషులు ఎలాగైతే జాగ్రత్తగా, ఓర్పుతో, శిక్షణ ద్వారా బలవంతులుగా తయారవుతారో, అలాగే తమ ఆలోచనాధోరణిలో బలహీనులైనవారు కూడా సరైన ఆలోచనమార్గంలో పయనించడానికి అభ్యాసం చేసినపుడు తమ ఆలోచనలలో శక్తివంతులుగా తయారవుతారు.

గమ్యంలేని గమనాన్ని, దుర్బలతనూ దూరంగా నెట్టి, ఒక లక్ష్యం, ఉద్దేశ్యంతో జతపరచిన ఆలోచనలను చేయడం మొదలుపెడితే, దాని అర్థం మనం కూడా వైఫల్యాల గుండా విజయం వైపు బాట సాగుతుందని గుర్తించి, అన్ని పరిస్థితులను తమకు సహాయపడే బంటులుగా చేసుకున్న శక్తిమంతుల జాబితాలో చేరామని లెక్క. అటువంటి విజయ మనోరథుల ఆలోచనలలో శక్తీ, ప్రయత్నాలలో నిర్భయత్వమూ, విజయసాధనలో నేర్పరితనమూ ఉంటాయి.

మనకై ఒక లక్ష్యాన్ని ఊహించుకోగానే, దానిని సాధించడానికి అటుఇటు చూడకుండా, తిన్ననైన సూటి మార్గాన్ని, మానసికంగా గుర్తించుకోవాలి. అనుమానాలను, భయాలను ఈ ప్రక్రియలో నుండి అతి జాగ్రత్తగా ఏరి పారేయాలి. ఎందుకంటే, సూటిగా సాగే మన పరిశ్రమను ముక్కలుముక్కలుగా చేసి, మన కృషిని వంకరటింకరగా ప్రయాణింపచేసి, పనికి రాకుండా అవి నీరు కార్చగలవు. అనుమానం, భయంతో కూడిన ఆలోచనలు దేనినీ సాధించలేవు. ఎప్పటికీ సాధించలేవు కూడా. అవి ఎల్లప్పుడూ

వైఫల్యానికే దారితీస్తాయి. అటువంటి ఆలోచనలు రంగ ప్రవేశం చేయగానే, లక్ష్యం చేరాలన్న ఆకాంక్ష, మనోధైర్యమూ, ఇంకా ఇలాంటి బలమైన ఆలోచనలన్నీ శక్తి హీనమైపోతాయి.

ఏదైనా సాధించగలమనే జ్ఞానం నుండే, చేద్దామనే తలంపు పుడుతుంది. భయం, అనుమానం, రెండూ జ్ఞానానికి బద్ధ శత్రువులు. వీటిని నాశనం చేయకుండా వదిలేసినా లేక వాటిని లక్ష్యపెట్టడం లేదా ప్రోత్సహించడంగానీ చేసినపుడు, అవి ప్రతి అడుగులోనూ అడ్డుపడతాయి.

అనుమానాన్నీ, భయాన్నీ జయించినవారు ఓటమిని కూడా జయించినవారవుతారు. వారిలోని ప్రతి ఆలోచనా శక్తివంతంగా ఉంటుంది. ఎదురైన కష్టాలన్నింటినీ ధైర్యంతో ఎదుర్కొని తిప్పి కొట్టగలుగుతారు. విజ్ఞతతో వాటినధిగమిస్తారు. ఎలాగైతే కాలాన్ని గుర్తించి విత్తితే పూలు పూసి, కాయలు కాస్తాయో, అలాగే సమయమెరిగి సంకల్పించిన వారి ఉద్దేశాలు, ఆశయాలు కూడా ఫలవంతమౌతాయి. అంతేకానీ అపజయం పాలై అర్ధాంతరంగా రాలిపోవు.

ఆలోచన నిర్భయంగా లక్ష్యంతో చేతులు కలిపినపుడు సృజనాత్మక శక్తిగా రూపుదిద్దుకుంటుంది. ఈ విషయాన్ని తెలుసుకున్నవారు, మహత్తరంగా, శక్తిమంతులుగా తయారవ్వాలనుకుంటారే తప్ప, నిలకడలేని ఆలోచనాపరునిగా, ఎప్పుడో ఒక వెలుగురేఖను అందించి అబ్బురపరచేవానిగా మిగిలిపోవాలని అనుకోరు. అటువంటివారు తమ మానసిక

శక్తులను తెలివిగానూ, చైతన్యవంతంగానూ వినియోగించుకోగలిగిన వారౌతారు.

# లక్ష్యసాధనలో ఆలోచన పాత్ర

ఏ మనిషి యొక్క సఫలతకైనా, విఫలతకైనా, మూల కారణం అతని ఆలోచనలే. క్రమం తప్పకుండా నడిచే ఈ ప్రపంచం గతి తప్పడం అంటే సర్వనాశనమే! అటువంటి నేపథ్యంలో వ్యక్తిగతమైన బాధ్యత కూడా సంపూర్ణమైనదే అవుతుంది. ఎవరి బలాలు, బలహీనతలు, స్వచ్ఛత, కలుషితాలు, వారి బాధ్యతే కాని మరొకరివి కాదు. వాటికి కారణభూతులు వారే కాని మరొకరు కాదు. వాటిని మార్చుకోగలిగింది కూడా వారే కానీ మరింకెవరి వల్లనో కాదు. ఒక వ్యక్తి ఉన్న పరిస్థితులు ఆ వ్యక్తి సృష్టించుకున్నదే గాని, అందుకు మరెవరో కర్తకాదు. అతడి సుఖ, దుఃఖాలు అతనిలో నుండి ఉద్భవించినవే. ఆ వ్యక్తి యొక్క ఆలోచనల స్వరూపమే అతడౌతాడు. ఏవిధమైన రీతిలో ఆలోచన కొనసాగిస్తాడో, అలాగే ఉండిపోతాడు.

సహాయం స్వీకరించడానికి బలహీనుడు సంసిద్ధం కానంతవరకూ, తానే సహాయం కావాలని అనుకోనంతవరకూ, బలవంతులు బలహీనులకు సహాయపడలేరు. అలా సహాయం అందినప్పటికి కూడా, బలహీనుడు తనంత తానుగా బలవంతునిగా తయారుకావడానికి ప్రయత్నించాలి. స్వయంగా కృషి చేస్తూ ఇతరులలో తను మెచ్చుకొంటున్న ఆ బలాన్ని తనలో పెంపొందించుకోవాలి. ఎవరి చుట్టూ ఉన్న పరిస్థితులను మార్చుకోగల శక్తి ఆ ఒక్కరికే ఉంది.

అణిచేవారి వల్లనే అణగదొక్కబడిన బాధితులు ఉన్నారనీ, అందువల్ల అణిచేవారిని నిందించాలనే భావన తరచూ వినిపిస్తుంది. మరోపక్క, దీనికి వ్యతిరేకంగా, బాధితులనబడే వారిలో ఉన్న

లొంగిపోయే లక్షణం వల్లనే, మరొకరిని అణిచేవారిగా గుర్తిస్తున్నామనీ, అందువల్ల దీనికి కారణం బాధితుల దౌర్బల్యమేననే వాదన కూడా వినిపిస్తుంది. నిజమేమిటంటే, ఆ ఇద్దరిలో ఒకరు మరొకరిని బాధిస్తున్నారని అనిపిస్తున్నప్పటికీ, అజ్ఞానంలో ఒకరికొకరు సహకరించుకుని తమకు తామే హాని కల్గించుకుంటున్నారు.

అణగదొక్కబడే వానిలో బలహీనత, అణగదొక్కేవానిలో శక్తిని తప్పుగా ప్రయోగించడం – ఈ రెండింటిలో కూడా ఒకే విశ్వజనీన న్యాయసూత్రం పని చేస్తుందని, సరైన జ్ఞానం ఉన్నవాడు గ్రహిస్తాడు. పరిపూర్ణమైన ప్రేమమూర్తి వీరిద్దరి ప్రవర్తనలనూ, అవి వారిద్దరికీ కలిగించే బాధలను గుర్తించి, వీరిలో ఎవ్వరినీ తప్పుపట్టడు. సరికదా, వారిద్దరినీ తన కరుణతో స్వీకరించగలుగుతాడు.

బలహీనతను జయించి, స్వార్థపూరితమైన ఆలోచనలను నిర్మూలించుకున్నవాడు, అణిచే లేదా అణచబడే కోవలలో దేనికీ చెందడు. అటువంటి వారు ఏ వర్గానికీ చెందని స్వతంత్రులు.

మరోలా చెప్పాలంటే, మనిషి తన ఆలోచనలలో అంతర్గతంగా ఎదిగినప్పుడు మాత్రమే విజయాన్ని సాధించగలుగుతాడు. అలా ఎదగనంతకాలం, తాను బలహీనుడిగానో, బలవంతుడిగానో భావించుకుంటాడు గానీ, తాను స్వతంత్రుడినని అనుకోడు.

మన ఆలోచనలు భోగలాలసత్వం దాటి ఊర్ధ్వముఖంగా పైకి తీసుకుపోయినపుడే ఏదైనా సాధించగలం. కనీసం సామాన్యమైన

ప్రాపంచిక విషయాన్ని సాధించడంలో కూడా ఇది అవసరం అని తెలుసు. అలాగని విజేత కావడానికి మనలోని స్వార్థపు ఆలోచనలన్నింటినీ త్యజించమని కాదు. కాని వాటిలో కొన్నింటినైనా త్యాగం చేయక తప్పదు. మనలో బలంగా ఉన్న ఆలోచనలు విషయలాలసత్వం వైపే మొగ్గు చూపేవైతే, మనం స్పష్టంగా ఆలోచించనూలేము, సక్రమంగా ప్రణాళిక గానీ పథకం గానీ వేసుకోనూలేము, మనలో నిద్రాణమైయున్న వనరులను గుర్తించి వాటిని అభివృద్ధి పరచుకోనూలేము. అందుచేత ఏ పని చేపట్టినా అపజయం పాలవుతాం. సమర్థవంతంగా ఆలోచనలను అదుపులో పెట్టడం ఇంకా మొదలు పెట్టనివారు, వ్యవహారాలపై అదుపు సాధించలేరు. పెద్ద బాధ్యతలను స్వీకరించనూలేరు. అటువంటివారు స్వతంత్రంగా స్వేచ్ఛతో పని చేయడానికి అర్హులు కారు. ఎందుకంటే, వారు ఎంపిక చేసుకున్న ఆలోచనలే వారిని పైకి ఎదగనీయకుండా చేస్తున్నాయి.

కొంత మేరకు అయినా త్యజించడానికి సిద్ధపడకపోతే పురోగతి, ఎదుగుదల సాధ్యం కాదు. ఎంత వరకు మన స్వార్థాన్నీ, విషయ, భోగలాలసతలను అధిగమించి, మనం వేసుకున్న ప్రణాళిక, పథకాలపై దృష్టిసారిస్తామో; స్పష్టతను, ఆత్మ విశ్వాసాన్ని దృఢపరచుకుంటామో, ఆ మేరకే ప్రాపంచిక విజయాలు మనల్ని వరిస్తాయి. మన ఆలోచనలలో ఔన్నత్యం ఎదిగినకొద్దీ, మనం మరింత నిజాయితీగా, సక్రమంగా, ఆదర్శవంతంగా ఎదుగుతాం. దానికనుగుణంగా ఘన విజయాలు మనల్ని వరించడమే కాక, మనం సాధించినవి పదికాలాల పాటు నిలిచి, పది మందికీ ఉపయోగపడతాయి.

అంతా తమకే కావాలనుకున్న అత్యాశాపరులకు, నిజాయితీ లోపించిన వారికీ, దుర్మార్గులకు, పైపైకి ప్రపంచం సహాయపడుతున్నట్లుగా కన్పించినా, నిజానికి ఈ ప్రపంచం అటువంటి వారిని ప్రోత్సహించదు. నిజాయితీ పరులకు, ఉదారస్వభావం కలవారికీ, సన్మార్గ పరులకు మాత్రమే అసలైన సహాయం లభిస్తుంది. ప్రతి కాలంలోనూ గొప్ప మహాత్ములు ఈ విషయాన్ని అనేక విధాలుగా ఎలుగెత్తి చాటారు. ఏ వ్యక్తి అయినా, తన ఆలోచనలను ఉన్నతంగా పైకి తీసుకుపోయి, కృషి సల్పడం ద్వారా, సన్మార్గునిగా మారినపుడు, ఈ మౌలిక రహస్యాన్ని తెలుసుకుని నిరూపించిన వాడవుతాడు.

ప్రకృతిలోనూ, జీవితంలోనూ అందమైనదీ, సత్యం అయిన దానినీ లేదా జ్ఞానాన్ని పొందడానికి చేసే అన్వేషణతో ఆలోచనను జోడించినపుడు మనిషికి మేధోపరమైన విజయం చేకూరుతుంది. ఒక్కోసారి ఇలాంటి విజయాలు గొప్పలు చెప్పుకోవడానికి, గొప్ప అన్పించుకోడానికే పనికొచ్చినప్పటికీ, వాటి వెనుక కూడా ఎంతో దీర్ఘమైన, కఠోర పరిశ్రమ, స్వచ్ఛమైన స్వార్థరహిత ఆలోచనలూ ఉంటాయి. వీటి సహజ పరిణామంగా వచ్చినవే ఇటువంటి విజయాలు.

పవిత్రమైన ఆకాంక్షలు పరాకాష్టకు చేరుకున్నపుడు ఆధ్యాత్మిక విజయాలు సంభవిస్తాయి. సూర్యచంద్రులు ఎలాగైతే ఖచ్చితంగా గతి తప్పరో, అలాగే ఉన్నత, ఉదార భావాల రూపకల్పనలో ఎల్లప్పుడూ మునిగి తేలేవారూ, స్వార్థరహితమైన, స్వచ్ఛమైన భావనలలోనే సంచరించేవారూ కూడా అంత ఖచ్చితంగా

ఉదాత్తమైన శీలం గల జ్ఞానులుగా రూపుదిద్దుకుంటారు. వారు తమ ఆశీర్వాదాలను, ప్రభావాన్నీ అందరికీ పంచగలిగే ధన్యమైన స్థాయికి చేరుకుంటారు.

ఆలోచనలు, కృషి శిఖరాగ్రానికి చేరుకున్నపుడే లక్ష్యసాధన సంభవం అవుతుంది. సక్రమంగా లక్ష్యం దిశగా చేసే ఆలోచనలు, స్పష్టత, నిగ్రహం, సత్ప్రవర్తన ఉన్నపుడే మనం పైకి ఎదుగుతాం. సోమరితనం, స్వీయ నియంత్రణాలోపం, గందరగోళపు ఆలోచనలు మన వెంట ఉంటే పతనమౌతాం.

ఏ వ్యక్తి అయినా ప్రాపంచిక రంగంలో ఉన్నత విజయ శిఖరాలు చేరియుండవచ్చు గాక, ఆధ్యాత్మిక రంగంలో కూడా ఎంతో ఉన్నతంగా ఎదిగి యుండవచ్చుగాక, కానీ గర్వం, స్వార్థం, అవినీతికరమైన ఆలోచనలను గనక హృదయంలోనికి రానిచ్చి వాటికి తాను వశమైతే, బలహీనతలతో అంత ఎత్తు నుంచీ, నీచమైన స్థాయికి దిగజారిపోతాడు.

సరైన ఆలోచనలతో సాధించిన విజయాలను నిలదొక్కుకోవాలంటే, నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. చాలా మంది సాఫల్యత దక్కగానే పట్టువదిలి అతి త్వరలోనే వైఫల్యం దిశగా దిగజారిపోతారు.

స్పష్టంగా నిర్దేశించిన ఆలోచనల ఫలితమే సాఫల్యత. ఏ రంగమైనా – వ్యాపార రంగం కావచ్చు, మేధోపరమైన రంగం కావచ్చు, ఆధ్యాత్మిక రంగం కావచ్చు – సాఫల్య సిద్ధాంతం మాత్రం ఒకటే.

దాన్ని పరిపాలించే న్యాయసూత్రం, పద్ధతీ కూడా ఒకటే. రంగం ఏదైనా, ఉన్న తేడా అంతా లక్ష్యంలో ఉంటుంది.

తక్కువ సాధించిన వారు, తక్కువ మోతాదులో త్యాగాలు చేసిన వారైయుంటారు. చాలా సాధించాలనుకున్నవారు, చాలా త్యాగాలు చేయాల్సి ఉంటుంది. గొప్ప ఘన విజయాలు సాధించాలనుకున్నవారు, అంత ఘనమైన త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలి.

# దర్శనం — ఆదర్శం

కలలు కనగలిగిన వారే దర్శించగలరు. వారినే ద్రష్టలు, దార్శనికులు అంటారు. వారి వల్లనే ఈ ప్రపంచం అభివృద్ధి సాధిస్తూ ముమ్ముందుకు పోతున్నది. కనపడే ప్రపంచం ఎలాగయితే కనపడని ప్రపంచం మీద ఆధారపడినడుస్తుందో, అలాగే, రకరకాల ప్రయత్నాలు, పరీక్షలు, తప్పుల మధ్య సాగిన మానవ ప్రపంచపు మనుగడ, తమ కలల్లో ఒంటరిగా దర్శించిన దార్శనికుల ఆలోచనలపై ఆధారపడి ముందుకు సాగుతుంది.

అందుచేత మానవజాతి ఈ దార్శనికులను మరచిపోలేదు, వారి ఆదర్శాలను రాలి పోనివ్వదు, అస్తమించనివ్వదు. మానవజాతి ఆ ఆదర్శాలలోనే జీవిస్తుంది. అవి నిజాలనీ, ఏదో ఒక నాడు తప్పక వాటిని చూసి అర్థం చేసుకోగలమనీ మానవజాతి నమ్ముతుంది.

స్వరకర్తలు, శిల్పులు, చిత్రకారులు, కవులు, కాలజ్ఞానులు, ఋషులు వీరంతా పరసృష్టికర్తలు. ఈ ప్రపంచం అందంగా ఉందంటే, అటువంటి దార్శనికులు ఇక్కడ జీవించారు కాబట్టే. వారే లేకుంటే వట్టి శ్రమ జీవులుగా మానవులు ఏనాడో నశించి పోయేవారు.

ఎవరైతే ఒక చక్కటి స్వప్నాన్ని, ఒక ఉన్నతమైన ఆదర్శాన్నీ తమ హృదయాలలో పోషిస్తారో, వారు దానిని ఒకానొకరోజు సాకారం చేసుకుంటారు. దర్శించి తీరుతారు. తమున్న దేశాన్ని దాటి, మరో ప్రపంచం ఉందని ఊహించి, దాన్ని నమ్మి, కొలంబస్ చివరకు కనుకొన్నాడు. విశ్వం చాలా విస్తృతమైనదనీ, దానిలో బహుళ ప్రపంచాలున్నాయనీ కోపర్నికస్ ఊహించి, దర్శించాడు, దానినే తర్వాత చాటి చెప్పాడు. ఎటువంటి మచ్చాలేని సుందరమైన

పరిపూర్ణమైన ప్రశాంతతతో కూడిన ఆధ్యాత్మిక ప్రపంచాన్ని బుద్ధుడు దర్శించాడు, దానిలోకి చివరకు ప్రవేశించాడు కూడా.

మీ స్వప్నాలను, ఆదర్శాలను హృదయంలో పదిలపరచుకోండి. మీ హృదయాన్ని కదిలించే రాగాన్ని, మనస్సులో రూపుదిద్దుకుంటున్న అందాలను, మీలోని అతి సున్నితమైన ఆలోచనలతో పెనవేసుకు పోయిన ప్రేమతత్వాన్ని విలువిచ్చి హృదయంలో దాచుకోండి. స్వర్గలోకపు వాతావరణం, ఆహ్లాదకరమైన పరిస్థితులు వీటి నుండే పుడతాయి. మీ జీవితాన్ని వీటికి అనుగుణంగా కొనసాగిస్తూ ఉంటే, మీ ప్రపంచ నిర్మాణం తప్పక జరిగి తీరుతుంది. దానిని మీరు తప్పక దర్శిస్తారు.

కోరుకోవడం అంటే పొందాలని అనుకోవడమే. ఆకాంక్షించడం అంటే సాధించి తీరాలని అనుకోవడమే. మనిషిలోని అత్యంత పాశవికమైన కోరికలు సాఫల్యం చెంది, అతిస్వచ్ఛమైన ఆకాంక్షలు ఆధారం లేక మలమల మాడిపోవాలా? విశ్వజనీనమైన న్యాయసూత్రం ఇలా జరగనివ్వదు. అలాంటి పరిస్థితులు రానివ్వదు. "అడుగు, నీకు తప్పక లభిస్తుంది" అన్నదే ప్రకృతి నియమం.

ఉదాత్తమైన స్వప్నాలను కాంక్షించండి. మీరు ఎలా కాంక్షిస్తారో అదే మీరుగా అవుతారు. మీ కలలు నిజమై తీరుతాయి. మీరు భవిష్యత్తులో ఏం కాబోతారో, దానినే ముందుగా స్వప్నాల్లో మీరు దర్శిస్తారు. అంటే, ఆ దర్శించినది ఒక వాగ్దానం లాంటిది. మీరు భవిష్యత్తులో ఆవిష్కరింపజేసేది ఇప్పటి మీ ఆదర్శాన్నే. అంటే, మీ ఆదర్శం ఒక విధంగా భవిష్యవాణి అన్నమాట.

ఇప్పుడు సాధ్యమైన ఘన విజయాలన్నీ ఒకప్పుడు కొంత కాలంవరకూ స్వప్నంలా అనిపించినవే. బ్రహ్మాండమైన మఱ్ఱిచెట్టు, దాని విత్తనంలో నిద్రాణమై ఉన్నదే. గుడ్డులోనే పక్షి నిరీక్షిస్తున్నది. జీవి ఊహించే మహోన్నత స్థాయి స్వప్నంలో, దివ్యమైన ఆదర్శం మేల్కొంటుంది. ఈనాటి వాస్తవాల మొలకలే ఒకనాటి కలలు.

మీ ప్రస్తుత పరిస్థితులు అనువైనవి కాకపోవచ్చు. కానీ ఎప్పుడయితే మీ ఆదర్శాన్ని ఊహల్లో గుర్తించి, దానిని అందుకోడానికి సిద్ధపడతారో అప్పుడే మీ పరిస్థితులు మారడం మొదలెడతాయి. మీరు మీ అంతరంగంలో గమ్యంవైపు సాగగానే, బాహ్య రంగంలో కూడా గమనం మొదలవక తప్పదు.

ఇక్కడ మీకు ఒక యువకుడి గురించి చెప్పదలచుకున్నాను. చాలా పేదరికానికీ, కష్టాలకూ గురై ఇబ్బందుల్లో ఉన్నాడు. అనారోగ్యకరమైన వాతావరణం గల చిన్న కర్మాగారంలో చాలా గంటలు పని చేయవలసివచ్చేది. పెద్దగా చదువు లేక పోవటంతో బాటు, మరోవిధంగా మెరుగుపడే అవకాశాలు కూడా దాదాపుగా లేవు. కానీ మంచి విషయాల గురించి కలలు కంటూ ఉండేవాడు. తెలివి తేటలు గురించి, సంస్కారం గురించి, హుందాతనం గురించి, అందం గురించీ ఆలోచిస్తూ ఉండేవాడు. మంచి పరిస్థితులతో కూడిన ఆదర్శవంతమైన జీవితాన్ని ఊహించుకుని, దానిని మానసికంగా నిర్మించుకోవడం మొదలుపెట్టాడు. విస్తారమైన స్వేచ్ఛతో, ఒక పెద్ద బాధ్యత నిర్వహిస్తున్నట్లుగా కన్న ఆ స్వప్నం అతడిని తన చేతుల్లోకి తీసుకుంది. దీని వలన కలిగిన అశాంతి అతడిని చర్యకు ఉసిగొల్పుతుంది. చేతనైనంతగా – చిన్న స్థాయిలోనే

అయినప్పటికీ – తనకున్న మిగులు సమయాన్నంతా అంతర్గతంగా దాగియున్న శక్తులను, వనరులను తన అభివృద్ధికి వినియోగించనారంభిస్తాడు.

అతి త్వరలోనే అతని మనస్సు ఎంతగా పరిణతి చెందిందంటే, ఆ చిన్న కర్మాగారం అతడిని ఇక ఎంత మాత్రం సాకలేదన్నట్టుగా పరిస్థితులు మారిపోయాయి. ఆ కర్మాగారం ఇక అతని మనస్తత్వంతో పొంతన కోల్పోయి సరితూగలేని పరిస్థితి ఏర్పడి, ఒంటిమీద మాసిన వస్త్రాలు పక్కన పడేసినట్టుగా, ఆ కర్మాగార వాతావరణం అతడి జీవితం నుండి విడిపోయింది. విస్తరిస్తున్న తన శక్తులకు సరితూగిన అవకాశాలు ఎక్కువగా రావడంతో అతడు అక్కడి నుండి నిష్క్రమిస్తాడు.

కొన్నేళ్ళకు అతడు చాలా పెద్దగా ఎదిగినట్లు తెలుస్తుంది. తనదైన ప్రత్యేక పద్ధతులలో, మానసికపరమైన కొన్ని శక్తులను జయించిన నైపుణ్యంతో, ప్రపంచం అన్ని చోట్లా ఎదురులేని శక్తితో అందర్నీ ప్రభావితం చేయగలుగుతాడు. అతని చేతుల్లో ఇప్పుడు మహా గొప్ప బాధ్యతలున్నాయి. అతను మాట్లాడితే చాలు, మనుషుల జీవితాలు మారిపోతాయి. ఆ మాటలు విన్న మగ, ఆడా తమ తమ వ్యక్తిత్వాలను సరిగా మలుచుకుంటున్నారు. సూర్యుని వలే, ప్రకాశిస్తున్న కేంద్రంలా అతను తయారవగా, అసంఖ్యాకమైన జీవితాలు అతనితో ముడిపడి ఉన్నాయి. యువతగా ఉన్నప్పటి తన కలలను సాకారం చేసుకున్నాడు ఆ యువకుడు. తన ఆశయాలతో సారూప్యం చెందాడు కూడా. చూసారా!

యువ చదువరులారా! మీరు కూడా మీ హృదయాలలో ఆకాంక్షించిన మీ స్వప్నాలను భవిష్యత్తులో దర్శించగలరు. అవి పాశవికమైనవైనా లేదా సుందర స్వప్నాలైనా లేదా రెండింటి మిశ్రమం అయినాకూడా కావచ్చు. ఏదైనప్పటికీ, ఒకటి మాత్రం గుర్తుంచుకోండి, మీరు మీ అంతరాంతరాళలలో రహస్యంగా దేనిమీదైతే ఎక్కువ మక్కువ చూపిస్తారో, దానివైపుగా మీరు ఆకర్షితులవుతారు. మీ ఆలోచనలకు సరిసమానంగా తగిన ప్రతిఫలం మీ చేతుల్లోనే ఉంచబడుతుందని గ్రహించండి. ఎక్కువతక్కువలు లేకుండా, ఖచ్చితంగా మీరు సంపాదించినదే మీకు దక్కుతుంది.

మీ ప్రస్తుత పరిస్థితులు ఏమైనా కానివ్వండి. మీరు దిగజారినా, నిలబడినా, పైకి ఎదిగినా – దేనికైనా కారణం మీ ఆలోచనలు, మీ స్వప్నం, మీ ఆదర్శం మాత్రమే. మిమ్మల్ని అదుపులో పెడుతున్న కోరికంత చిన్న స్థాయికైనా దిగజారగలరు. లేదా మీలోని బలమైన ఆకాంక్షంత ఎత్తుకు అయినా ఎదగగలరు. స్టాంటన్ కిర్కమ్ డేవిస్ గారి సుందరమైన మాటల్లో చెప్పాలంటే, "ఇప్పుడు నువ్వో పద్దులు రాసే వాడివే కావచ్చు. కాని ఇన్నాళ్ళూ నీ ఆదర్శాన్నీ, ఆశయాల్నీ బంధించిన ఆ ద్వారం దాటి, బయట శ్రోతల ముందుకొచ్చి, నీ అంతరంగంలో దాక్కున్న స్ఫూర్తిని వారందరి ముందు ప్రకటిస్తావు. నీ పూర్వాశ్రమంలోని నీ వాలకం చిహ్నాలయిన నీ చెవిలోని పెన్నూ, వేళ్ళమీద సిరామరకలు ఇంకా చెరిగిపోయి ఉండవు. అయినా నీ మనస్సులో ఉప్పొంగుతున్న ఆదర్శాన్ని అందరి ముందూ పెడతావు. నువ్వు గొర్రెలనే కాస్తూ ఉండవచ్చు. ఒకనాడు ఆశ్చర్యంతో, నోరెళ్ళ బెట్టుకొని దారి తప్పి పట్నంలో

అడుగుపెడతావు. నీకు తెలీకుండా నీలోని స్ఫూర్తి నిన్ను ఒక గురువు దగ్గరికి తీసుకువెళుతుంది. కొంతకాలం తర్వాత ఆయన "నీకు ఇంక నేర్పవలసిందేమీ లేదు" అంటారు. గొర్రెలు కాస్తూ, నిన్న మొన్నటి వరకు గొప్ప విషయాలను కలలు కన్న నువ్వే ఇపుడు గురువయ్యావు. గొర్రెలను విడిచిపెట్టి నువ్విపుడు ప్రపంచ పునర్నిర్మాణానికి ఉద్యమించావు."

ఆలోచించని వాళ్ళు, అజ్ఞానులు, సోమరులు అసలు విషయాన్ని గమనించకుండా, కేవలం విషయ ప్రభావాన్ని మాత్రమే చూస్తారు. అందువలన, అదృష్టం గురించీ, భాగ్యం గురించీ, అవకాశాల గురించీ మాట్లాడుతూ ఉంటారు. ఐశ్వర్యవంతుడిని చూసి, "ఎంతటి అదృష్టవంతుడో కదా!" అంటారు.

మరో గొప్ప విద్వాంసునిగా తయారైన వారిని చూసి, "అతనికి ఎంతగా కలిసి వచ్చిందో!" అని సులువుగా అనేస్తారు. మహాత్ముని స్వభావం కలిగి, ఇతరులను ప్రభావితం చేయగల మరొకరిని చూసి, "అదృష్టం ఎలా ప్రతిసారీ కలిసొస్తుందో కదా!" అంటారు. తమ తమ అనుభవాలను ఆర్జించడానికి వీళ్ళందరూ – మగైనా, ఆడైనా – ఇష్టపూర్వకంగా ఎన్ని ప్రయత్నాలు చేసారో, ఎన్ని వైఫల్యాలను ఎదుర్కొన్నారో, ఎన్ని కష్టాలుపడ్డారో ఎవ్వరూ అర్థం చేసుకోడానికి ప్రయత్నించినట్లుగా కనపడదు. వాళ్ళెన్ని త్యాగాలు చేసారో అన్నది సామాన్యులకు అక్కర లేదు. వచ్చిన అడ్డంకులను ఎదుర్కోడానికి వారు చేసిన కృషి గురించి ఎవరూ పట్టించుకోరు. వారెంత విశ్వాసాన్ని ప్రదర్శించారు అన్నది ఎవరూ గ్రహించినట్లు ఉండదు. తమ హృదయాల్లో ఆకాంక్షించిన ఆదర్శాన్ని

దర్శించుకోడానికి సామాన్యులు ఎదుర్కోలేని ఎన్నో అవరోధాలను వారధిగమించారన్న విషయాన్ని ఎవరూ గుర్తించరు. విజేత ఎదుర్కొన్న చీకట్లు, గుండె బద్దలైన సంఘటనలు గురించి తెలుసుకోడానికి ఇష్టపడరు. కానీ వారి జీవితంలో కనపడే ఆనందం, కాంతి రేఖలను చూసి, 'అదృష్టం' అని తేల్చేస్తారు. లక్ష్యాన్ని సాధించడం చూసి, "భాగ్యం వరించింది" అంటారే కానీ, వారు చేసిన సుదీర్ఘమైన ప్రయాసతో కూడిన ప్రయాణం సామాన్యుల కంటికి కనపడదు. కంటికి కనపడిన ఫలితాన్ని చూసి "అవకాశం వచ్చిందండీ" అని సులువుగా కొట్టిపడేస్తారే తప్ప, అదే విజయాన్ని తాము కూడా సాధించడానికి ఏ పద్ధతి అనుసరించాలి అన్నది ఆలోచించరు.

మనిషి చేసే వ్యవహారాలన్నింటిలో శ్రమా ఉంది, ఫలితమూ ఉంది. శ్రమకు కొలమానం ఫలితమే. మరోమాటలో చెప్పాలంటే, వచ్చే ఫలితాన్ని బట్టి ఎంతగా శ్రమించారో తెలుసుకోవచ్చు. ఇక్కడ అదృష్టానికి స్థానం లేదు. మనం వాడుకగా 'వరప్రసాదాలుగా' చెప్పుకునే లౌకిక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు, సిద్ధులు, కృషి యొక్క ప్రతిఫలాలే. అవే ముగింపుకు చేరిన ఆలోచనలు. సాధించిన లక్ష్యాలని వాటినే అంటారు. సాకారం చేసుకున్న లేదా దర్శించిన స్వప్నాలు అని కూడా వాటినే అంటారు.

మీ మనస్సులో ఏ స్వప్నానికి గొప్పదనాన్ని ఆపాదిస్తారో, మీ హృదయంలో ఏ ఆదర్శాన్ని అధిష్టింపజేస్తారో, దానితోనే మీ జీవిత నిర్మాణాన్ని సాగిస్తారు; అదే చివరకు మీరుగా అవుతారు.

# ప్రశాంతత

విజ్ఞతకున్న అనేక విశేషాంశాలలో మానసిక ప్రశాంతత ఒకటి. సుదీర్ఘంగా, సహనంతో స్వీయ నియంత్రణకు, నిగ్రహానికీ చేసిన సాధనా ఫలితమే 'ప్రశాంతత'. అది, పరిపక్వత చెందిన అనుభవానికి గుర్తు. ఆలోచనలకు సంబంధించిన సూత్రాల గురించి, అవి పని చేసే తీరు గురించి కూడా విశేషమైన జ్ఞానం ఉన్నదనడానికి కూడా మానసిక ప్రశాంతత ఒక చిహ్నం.

ఆలోచనల వికాస స్వరూపమే తాననే అవగాహన ఎంత మేరకు కలిగితే, అంత మేరకు మనిషి ప్రశాంతత అనుభవిస్తాడు. అటువంటి జ్ఞానానికి పర్యవసానంగా, ఇతరులను కూడా ఆలోచనల స్వరూపాలుగా అర్థం చేసుకోగలుగుతాడు. ఇలా సరిగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని వృద్ధి పరచుకుంటూ ఉండగా, దానితో పాటు కార్య-కారణ సంబంధం ప్రభావంగానే అంతర్గత సంబంధాలన్నీ రూపుదిద్దుకుంటున్నాయన్న మరింత స్పష్టమైన అవగాహన కలుగుతుంది. ఇలా స్పష్టత ఏర్పడడం వలన ఆందోళన, దుఃఖం, ఆగ్రహం, విచారం వంటి వాటి బారిన పడకుండా, నెమ్మదితో, నిలకడతో, ప్రశాంత చిత్తంతో ఉంటాం.

ప్రశాంత చిత్తం గలవారు, తమను తాము ఎలా నిర్వహించుకోవాలో తెలుసుకున్నవారు కాబట్టి, ఇతరులతో సఖ్యతతో మెలగగలుగుతారు. ఆ ఇతరులు కూడా ప్రశాంత చిత్తుల లోని ఆధ్యాత్మిక బలాన్ని గుర్తించి, వారి నుండి తాము నేర్చుకోగలమనే భావంతో వారిని గౌరవించడమే కాక, వారి మీద ఆధారపడతారు కూడా. మనం ఎంతగా ప్రశాంత మనస్కులౌతామో, అంతగా మన ఔన్నత్యమూ, ప్రభావమూ, మంచికి పాటుపడే శక్తీ పెరుగుతాయి. సామాన్య

వ్యాపారస్తుడు కూడా తనలో నిగ్రహం, సంయమనం బాగా వృద్ధి పరచుకున్నప్పుడు అతని వ్యాపారం పురోగతి దిశలో ప్రయాణిస్తుందని గ్రహిస్తాడు. ఎందుకంటే, ఎవరైనా నిలకడగల శాంత చిత్తులతోనే వ్యవహరించడానికి ఇష్టపడతారు.

స్థిర, శాంత చిత్తుడిని అందరూ గౌరవిస్తారు, అభిమానిస్తారు. అటువంటివారు తుఫానులో ఆశ్రయమిచ్చే గోవర్ధనగిరి లాంటి వారు. ఎడారిలో నీడనిచ్చే చెట్టులాంటివారు. ప్రశాంతమైన హృదయం, మధురమైన మాట, సమత్వం గల జీవనం ఉన్న వారిని ప్రేమించకుండా ఎవరుండగలరు? ఎండొచ్చినా, వానొచ్చినా లేదా మరెటువంటి మార్పు ఇటువంటి వారికి కల్గినా అవి వారికి అంటవు. ఎందుకంటే, వారు ఎల్లప్పుడూ అంతర్గతంగా మాధుర్యం, శాంతి, నిశ్చలత కలిగి ఉంటారు. మనిషి స్వభావంలో కనబడే ఆ గొప్ప గుణాన్నే మనం 'ప్రశాంతత' అంటాము. మానవ సంస్కృతిలో చిట్టచివరి మెట్టు ఇదే. జీవితం పుష్పించింది అన్నా ఇదే. జ్ఞానమంతటి మహత్వమైనదీ, విలువైనదీ ఈ ప్రశాంతత. దీనిముందు బంగారం ఏపాటిది? మేలిమి బంగారం కంటే కోరదగినది ఇది.

ప్రశాంతతతో కూడిన జీవితంతో పోలిస్తే, డబ్బు వెనక పరుగులెత్తే జీవితం వెలవెలపోవాల్సిందే. సత్యం అనే సాగరగర్భంలో, అలలూ, తుఫానులూ చేరని అట్టడుగున, శాశ్వతంగా, స్థిరంగా ఉండేదే 'ప్రశాంత జీవనం'.

తమ కోప, తాపాలతో మధురమూ, సుందరమూ అయిన జీవితాలను ఎంత మంది పాడు చేసుకుంటున్నారో, తమ వ్యక్తిత్వంలోని హుందాతనాన్ని పోగొట్టుకొని శత్రుత్వం పెంచుకుంటున్నారో! అవగాహనాలోపం వలన, నిగ్రహం లేకపోవడం వలన, చాలా మంది తమ జీవితాలను నాశనం చేసుకుని, ఆనందాన్ని కోల్పోవడాన్ని మనం చూస్తున్నాం. జీవితంలో మనకు తారసపడే వారిలో బహుకొద్దిమందిలో మాత్రమే, పరిపూర్ణంగా, సుందరంగా తీర్చిదిద్దిన వ్యక్తిత్వానికి చిహ్నంగా ఉండే ముగ్ధ మోహనమైన నిండుతనం మనకు కనిపిస్తుంది.

అవును మరి, అదుపులేని కోపంతో, అవధులులేని విచారంతో, ఆందోళన, అనుమానాలతో మానవ జాతి కొట్టుమిట్టాడుతోంది. కేవలం వివేకవంతుడైన వ్యక్తి మాత్రమే తన నిర్మలమైన ఆలోచనల ద్వారా, నిగ్రహంతో, స్థిరచిత్తంతో, ఆత్మ సృష్టించే పెనుగాలులను తన అదుపులోకి తేగలడు.

పెనుగాలులకు కొట్టుకుపోతున్న జీవులారా! మీరెక్కడున్నా, ఎటువంటి పరిస్థితులలో చిక్కుకున్నా సరే, ఇది తెలుసుకోండి: సంసారమనే సాగరంలో, ధన్యత్వపు ద్వీపాలు చిరునవ్వుతో స్వాగతిస్తున్నాయి. కాంతివంతమైన మీ ఆదర్శమనే తీరం మీ రాకకోసం వేచి ఉంది. ఆలోచనలనే చుక్కానిని మీ అదుపులో ఉంచుకోండి. మీ ఆత్మ అనే నౌకలోనే దాని ఆధిపత్యాన్ని వహించే పరమాత్మ నిద్రిస్తుంటారు. ఆయనను తట్టి లేపండి. సంయమనమే బలం. సరైన ఆలోచనే నైపుణ్యం. ప్రశాంతతే శక్తి. మీ హృదయానికి మీరే చెప్పుకోండి: 'శాంతిః శాంతిః శాంతిః'.